

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 15-02-2026 | సంపుటి - 26 | సంచిక -267 | రూ : 4 | పేజీలు: 8


# హంగ్‌లు చేజారొద్దు

- ఆయా మున్సిపాలిటీల గెలుపు బాధ్యత ఇన్‌ఛార్జి మంత్రులదే
- ఎక్స్ అఫీషియో ఓట్ల వినియోగంపై జాగ్రత్తగా వ్యవహరించాలి
- మంత్రులకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం
- సంక్షేమ పథకాలు, ప్రజాపాలనపై నమ్మకానికి పుర ఫలితాలు నిదర్శనమని వెల్లడి
- మున్సిపాలిటీలను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని పిలుపు

2లో





## ఈశాన్య భారతంలో
# చరిత్రాత్మక ఘట్టం


- అస్సాంలో తొలి 'ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ' ప్రారంభం
- జాతీయ రహదారిపై దిగిన ప్రధాని మోదీ విమానం
- రన్‌వేను తాకి వెళ్లిన సుఖోయ్, రఫేల్ యుద్ధ విమానాలు

2లో

## అంతరిక్షంలో
# డేటా సెంటర్లు

- ఉపగ్రహాల సమాచార మార్పిడి
- కక్ష్యలో కీలకంగా మారుతున్న ఏఐ
- భారతీయ అంకురాల ముందడుగు

భూమిపై చిన్న చెత్త ముక్క పడి ఉందనుకోండి. పెద్ద ప్రమాదమేమీ లేదు. కానీ, అంతరిక్షంలో పరిస్థితి వేరు. అక్కడ చిన్న శకలం వేగంగా దూసుకొచ్చి ఢీకొడితే పెను ప్రమాదమే సంభవిస్తుంది. రూ.వేల కోట్ల విలువైన ఉపగ్రహాలు, అంతరిక్ష యాత్రలు క్షణాల్లో బూడిదయ్యే ప్రమాదం తరువాయి 2లో




## సిట్టింగ్ జడ్జిలపై
# ఫిర్యాదుల వెల్లువ



- పదేండ్లలో 8వేలకు పైగా కంప్లైంట్‌లు
- 2024లో అత్యధికంగా 1170 ఫిర్యాదులు
- పార్లమెంటుకు కేంద్రం సమాచారం
- చర్యలపై ప్రశ్నకు స్పష్టత ఇవ్వని వైనం
- మేధావులు, న్యాయ నిపుణుల ఆందోళన

2లో



## 53 దేశాలపై
# సుంకాలు రద్దు

- ఆఫ్రికన్ దేశాలకు చైనా బాసట
- మే 1 నుంచి అమల్లోకి..
- ట్రంప్ టారిఫ్‌లకు భిన్నంగా జిన్‌పింగ్ ముందడుగు

బీజింగ్: అమెరికా అధినేత డోనాల్డ్ ట్రంప్ టారిఫ్‌లతో దడపుట్టిస్తుంటే... చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అందుకు భిన్నంగా దేశాల మధ్య వాణిజ్య, ఆర్థిక బంధాలను మరింత బలోపేతం చేసుకుంటున్నారు. తాజాగా చైనా, ఆఫ్రికన్ ఖండం మధ్య ఆర్థిక సంబంధాలను మరింతగా పెంచుకునే లక్ష్యంతో కీలక ముందడుగు వేశారు. మే 1 నుంచి దాదాపు అన్ని ఆఫ్రికన్ దేశాల వస్తువులపై దిగుమతి సుంకాలను బీజింగ్ తొలగిస్తుందని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ప్రకటించారు. ఈ వారాంతంలో తరువాయి 2లో

## షేక్ హసీనా అప్పగింతకు
# న్యాయ ప్రక్రియే కీలకం

- షేక్ హసీనా అప్పగింతకు న్యాయ ప్రక్రియే కీలకం
- బంగ్లాదేశ్ నూతన నేత తారిఖ్ రెహమాన్ వెల్లడి

2లో



## గొలుసుకట్టులా ప్రశ్నపత్రాల లీకేజీ..!



- జిరాక్స్ తీసే సమయంలో ఫొటోలు తీసిన ఉద్యోగి
- అతని ద్వారా ఓ విద్యార్థినికి.. ఆమె ద్వారా పలువురికి..
- వ్యవసాయ వర్సిటీ పరీక్షల్లో అక్రమాలపై కీలకాధారాలు లభ్యం

2లో

## సవాళ్లున్నా సంక్షేమం..
# అభివృద్ధే సంకల్పం

- పేదలకు వివిధ రూపాల్లో లబ్ధి రూ.51,883 కోట్లు
- పింఛన్లు, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, దీపం... తదితరాలు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళలకు రూ.91,527 కోట్లు
- సాగునీటి రంగానికి రూ.18,223 కోట్లు
- రూ.3,32,205 కోట్ల అంచనాతో రాష్ట్ర బడ్జెట్
- ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్



2లో

## షేక్ హసీనా అప్పగింతకు న్యాయ ప్రక్రియే కీలకం

ఢాకా: బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో విజయ దుందుభి మోగించిన బీఎన్‌పీ ఛైర్మన్ తారిఖ్ రెహమాన్ శనివారం దేశ ప్రజలను ఉద్దేశించి తొలి ప్రసంగం చేశారు. తన తొలి ప్రాధాన్యం దేశ ప్రయోజనాలకేనని స్పష్టంచేశారు. భారత్‌లో తలదాచుకున్న మాజీ ప్రధాని షేక్ హసీనా అప్పగింత న్యాయ ప్రక్రియపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. హసీనాను అప్పగించాల్సిందిగా భారత్‌ను కోరాలని బీఎన్‌పీ సీనియర్ నేతలు పలువురు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో తారిఖ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 'బంగ్లాదేశ్ ప్రజల ప్రయోజనాలే దేశ విదేశాంగ విధానాన్ని నిర్ణయిస్తాయి' అని తారిఖ్ రెహమాన్ పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో శాంతి భద్రతలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని స్పష్టంచేశారు. ప్రతి ఒక్కరి అభిప్రాయం తీసుకొని దేశాన్ని పునర్నిర్మిస్తామని భరోసా ఇచ్చారు. మరోవైపు కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. బంగ్లాదేశ్ అధ్యక్షుడు మహమ్మద్ షహాబుద్దీన్ మరో నాలుగు రోజుల్లో తారిఖ్ రెహమాన్ ఏర్పాటు చేయనున్న మంత్రివర్గం చేత పదవీ స్వీకార ప్రమాణం చేయించే అవకాశం ఉందని అభిజ్ఞవర్గాలు తెలిపాయి.

*** భారత్‌తో నిర్మాణాత్మక అనుబంధం**

భారత్‌తో నిర్మాణాత్మక అనుబంధాన్ని కొనసాగిస్తామని బీఎన్‌పీ అధినేత తారిఖ్ రెహమాన్ శనివారం స్పష్టంచేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తనను అభినందిస్తూ సోషల్ మీడియాలో చేసిన పోస్టుకు స్పందిస్తూ ఆయన ఈ విషయం వెల్లడించారు. బంగ్లాదేశ్ ప్రజాస్వామ్య విలువలకు, అందరి పురోగతికి, ప్రగతిశీల అభివృద్ధికి కట్టుబడి ఉందని ఆయన ప్రకటించారు.

## ఈశాన్య భారతంలో చరిత్రాత్మక ఘట్టం

గువాహటి: దేశ రక్షణ వ్యూహంతో పాటు బహుళ ప్రయోజనాలు ఇమిడి ఉన్న ఒక చరిత్రాత్మక ఘట్టం శనివారం ఆవిష్కృతమైంది. ఈశాన్య రాష్ట్రమైన అస్సాం దానికి వేదికైంది. దిబ్రూగఢ్ జిల్లాలోని జాతీయ రహదారి 37పై ఏర్పాటు చేసిన తొలి ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ(ఈఎల్ఎఫ్)ని ప్రధాని మోదీ ప్రారంభించారు. మోరాన్ బైపాస్ వద్ద రూ.వంద కోట్లతో తీర్చిదిద్దిన ఈఎల్ఎఫ్‌పై సి 130జే విమానంలో మోదీ ల్యాండయ్యారు. చైనాతో ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో ఉంచుకుని ఈశాన్య భారతంలో నిర్మించిన తొలి వ్యూహాత్మక రన్‌వే ఇది. పౌర, సైనిక అవసరాలను తీర్చేలా దీనిని రూపొందించారు. అత్యవసర పరిస్థితుల్లో దిబ్రూగఢ్ విమానాశ్రయానికి ప్రత్యామ్నాయంగానూ ఉపయోగపడనుంది. ప్రకృతి విపత్తులు, సరిహద్దు ప్రాంతాల్లో ఉద్రిక్తతలు తలెత్తినప్పుడు భారత వాయుసేన వేగంగా స్పందించేందుకు, విమానాల టేకాఫ్, ల్యాండింగ్‌కు ఇది ఎంతో అనుకూలం. ఇప్పటికే పశ్చిమ, ఉత్తర, మధ్య భారత్‌లో ఇటువంటివి ఉన్నాయి. ఈశాన్య రాష్ట్రాల్లో ఇదే మొట్టమొదటిది. దిబ్రూగఢ్‌మోరాన్ జాతీయ రహదారిపై ఉన్న రన్‌వే.. భారత్‌చైనా సరిహద్దుకు దగ్గరగా ఉండటంతో కీలక, వ్యూహాత్మక ప్రదేశంగా మారింది. చైనా సరిహద్దుకు 300 కి.మీ; మయన్మార్‌కు 200 కి.మీ. దూరంలో ఈఎల్ఎఫ్ ఉంది.

## హంగ్‌లు చేజారొద్దు

హైదరాబాద్: హంగ్ ఏర్పడిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు 'చే'జిక్కించుకునేలా పకడ్బందీ వ్యూహంతో ముందుకెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డి.. మంత్రులకు మార్గదర్శనం చేసినట్లు తెలిసింది. 'హంగ్ మున్సిపాలిటీల్లో ప్రతి ఓటూ కీలకం. మంత్రులు, పార్టీ సీనియర్ నేతలు అప్రమత్తంగా ఉండాలి. కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తి కనబరిచే స్వతంత్ర అభ్యర్థులు, ఇతర పార్టీల వారిని గుర్తించి చేర్చుకోవాలి' అని సీఎం దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. శనివారం జూబ్లీహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల ఫలితాలు, తదనంతర పరిణామాలపై కాంగ్రెస్ సీనియర్ నేతలు, మంత్రులతో సీఎం సమీక్షించారు. మున్సిపల్ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించినందుకు సీఎం మంత్రులందరినీ అభినందించగా.. గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో మున్సిపాలిటీలను కాంగ్రెస్ అభ్యర్థులు నెగ్గినట్లు మంత్రులు గణాంకాలతో వివరించినట్లు సమాచారం. సరైన వ్యూహంతో హంగ్ ఏర్పడిన వాటిని కూడా దక్కించుకుంటే 90 మున్సిపాలిటీలకుపైగా కాంగ్రెస్ వశమవుతాయని వారు వివరించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ''అందరం కలిసికట్టుగా పనిచేయడం వల్లే మంచి ఫలితాలు సాధించాం. కాంగ్రెస్ పార్టీ విజయం కోసం శక్తివంచన లేకుండా కృషిచేసిన కార్యకర్తలకు అభినందనలు. గత భారాస ప్రభుత్వం పదేళ్లలో చేయలేని పనులను ప్రజా ప్రభుత్వం రెండేళ్లల్లో చేసి చూపించింది. అభివృద్ధి, అమలుచేసిన సంక్షేమ పథకాలు, ప్రజా పాలనపై ప్రజల్లో నమ్మకం పెంపొందించాయనేందుకు ఈ ఫలితాలు నిదర్శనం. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లాలి. ఎన్నికలు ఏవైనా ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లాలి. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలి'' అని సీఎం పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సీతక్క, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్, వివేక్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్‌బాబు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సమావేశంలో పాల్గొన్నారు. ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జూమ్‌లో హాజరయ్యారు. ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్‌రెడ్డి, వేం నరేందర్‌రెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి సమావేశంలో పాల్గొన్నారు.

## 53 దేశాలపై సుంకాలు రద్దు

బీజింగ్: అమెరికా అధినేత డోనాల్డ్ ట్రంప్ టారిఫ్‌లతో దడపుట్టిస్తుంటే... చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అందుకు భిన్నంగా దేశాల మధ్య వాణిజ్య, ఆర్థిక బంధాలను మరింత బలోపేతం చేసుకుంటున్నారు. తాజాగా చైనా, ఆఫ్రికన్ ఖండం మధ్య ఆర్థిక సంబంధాలను మరింతగా పెంచుకునే లక్ష్యంతో కీలక ముందడుగు వేశారు. మే 1 నుంచి దాదాపు అన్ని ఆఫ్రికన్ దేశాల వస్తువులపై దిగుమతి సుంకాలను బీజింగ్ తొలగిస్తుందని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ప్రకటించారు. ఈ వారాంతంలో ఆఫ్రికన్ యూనియన్ శిఖరాగ్ర సమావేశానికి ఆఫ్రికన్ నాయకులు సమావేశమైన తరుణంలో ఈ నిర్ణయం బహిరంగంగా ప్రకటించబడింది. సవరించిన విధానం ప్రకారం... తైవాన్ ప్రభుత్వాన్ని ఇప్పటికీ గుర్తించే ఏకైక ఆఫ్రికన్ దేశం ఎస్వాటినిని మినహాయించి, చైనా అధికారిక దౌత్య సంబంధాలను కొనసాగిస్తున్న 53 ఆఫ్రికన్ దేశాల నుంచి దిగుమతులకు సున్నా సుంకం అమల్లోకి రానున్నది. గతంలో 33 ఆఫ్రికన్ దేశాలకు సున్నాసుంకం ఒప్పందం అమలులో ఉంది. వాణిజ్యం, సహకారాన్ని సులభతరం చేయడంలో బీజింగ్ నిబద్ధతను నొక్కి చెబుతూ... సుంకాల తగ్గింపును "నిస్సందేహంగా ఆఫ్రికన్ అభివృద్ధికి కొత్త అవకాశాలను అందించే" ఒక అడుగుగా జిన్‌పింగ్ అభివర్ణించారు.

## పుల్వామ వీరుల స్మారకంగా 5కె రన్

*** సాధన గ్రూప్ అఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో నిర్వహణ**









పుల్వామాలో వీరమరణం పొందిన జవాన్లకు నివాళిగా సాధన హై స్కూల్ 5కే పరుగును నిర్వహించారు. శుక్రవారం ఉదయం రన్ టూ రిమెంబెర్ దేర్ సాక్రిఫైస్ అనే నినాదంతో చేపట్టిన పరుగు కైసర్ నగర్ లోని ప్రతిభ పాఠశాల నుంచి మార్కెండేయ నగర్ వరకు 5 కిలోమీటర్లు సాగింది. సాధన గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌కు చెందిన విద్యార్థులతో పాటు సిబ్బంది కూడా ఈ పరుగు లో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని సాధనా గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ జి. ప్రవీణ్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ జి. కవితా రెడ్డి లు జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు దేశభక్తి భావంతో పరుగు పూర్తి చేసి వీరమరణం పొందిన జవాన్లకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్, అకాడమిక్ డైరెక్టర్ లావా కుమార్ పుల్వామా దాడి వివరాలు, భారత సైన్యం యొక్క మహత్తు, జవాన్ల త్యాగాలు గురించి వివరించారు. దేశభక్తి, క్రమశిక్షణ, బాధ్యత గుణాలను విద్యార్థులు అలవరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌కెఎం హై స్కూల్ ప్రతినిధి లావా కుమార్, ఏ ఎం ఎస్ స్కూల్ ప్రతినిధి సయ్యద్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## గొలుసుకట్టులా ప్రశ్నపత్రాల లీకేజీ..!

హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం (పీజేటీఏయూ)లో ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై వర్సిటీ అంతర్గత విచారణ, సీఐడీ దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. వర్సిటీ పరిధిలోని మూడో సంవత్సరం విద్యార్థుల మొదటి సెమిస్టర్(202526) పరీక్షలకు సంబంధించిన లీకేజీ వ్యవహారంలో ఇంటిదొంగల నిర్వాకంపై కీలక సమాచారం లభ్యమైనట్లు తెలిసింది. ఇందులో వరంగల్ వ్యవసాయ కళాశాలలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ కార్తిక్ కీలకపాత్ర వహించినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ప్రశ్నపత్రాలను జిరాక్స్ తీసే సమయంలో అతను సెల్‌ఫోన్‌తో ఫొటోలు తీసి..ఇన్‌సర్వీస్ విద్యార్థుల(ఏఈవోలు)కు పంపినట్లు విచారణాధికారులు నిర్ధారణకు వచ్చారు. కార్తిక్ బ్యాంకు ఖాతాలలో పెద్దఎత్తున నగదు లావాదేవీలున్నట్లు గుర్తించారు. దర్యాప్తు క్రమంలో మరికొన్ని ప్రశ్నపత్రాల లీకేజీకి సంబంధించిన వివరాలు బహిర్గతమైనట్లు విశ్వసనీయంగా తెలిసింది.

**అనుమానంతో మొదలై..**

క్లిష్టతరంగా భావించే ఓ పరీక్షలో ఇన్‌సర్వీస్ స్టూడెంట్లు అసాధారణ రీతిలో మార్కులు సాధించడం అనుమానాలకు తావిచ్చింది. దీంతో వైస్‌ఛాన్స్‌లర్ ప్రొ.అల్దాస్ జానయ్య, డీన్ ఝాన్సీరాణి గతేడు డిసెంబరు 24న జగిత్యాలలోని వ్యవసాయ కళాశాలలో తనిఖీలు నిర్వహించారు. నవంబరు 17న ఆ పరీక్ష జరిగిన రోజు సీసీ కెమెరాలను పరిశీలించి.. రమేశ్ అనే విద్యార్థి కదలికలు అనుమానాస్పదంగా ఉన్నట్లు కనిపెట్టారు. ఈ నేపథ్యంలోనే ఎంటమాలజీ హెచ్‌వోడీ డా.నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా.అంజయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.ఎస్.పి.రవికుమార్, డా.సంపత్‌లతో కూడిన అంతర్గత విచారణ బృందాన్ని వర్సిటీ నియమించింది. ప్రాధాన్యం దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం కేసును సీఐడీకి అప్పగించింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం..దర్యాప్తులో వెలుగుచూసిన అంశాలిలా..

**ఒకర్నుంచి.. మరొకరికి చేరిందిలా..**

* వర్సిటీ విచారణ బృందం తొలుత జనవరి 5న జగిత్యాలకు వెళ్లి విద్యార్థి రమేశ్‌ను విచారించింది. అదే కళాశాలకు చెందిన ఇన్‌సర్వీస్ విద్యార్థి శ్రీనివాస్ తనకు ప్రశ్నాపత్రాల్ని వాట్సప్‌లో పంపించినట్లు రమేశ్ వెల్లడించాడు.

* అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థి దుర్గారావు ద్వారా తనకు ప్రశ్నపత్రాలు అందినట్లు విచారణలో శ్రీనివాస్ వెల్లడించగా, అశ్వారావుపేట కళాశాలకే చెందిన ఓ విద్యార్థిని నుంచి తనకు వాట్సప్‌లో ప్రశ్నాపత్రాలు అందినట్లు దుర్గారావు వెల్లడించాడు.

* వరంగల్ వ్యవసాయ కళాశాలకు చెందిన ఓ విద్యార్థిని వాట్సప్‌లో తనకు ప్రశ్నపత్రాలు పంపినట్లు, ప్రశ్నపత్రాల కోసం అశ్వారావుపేట కళాశాలలోని పలువురు విద్యార్థుల నుంచి వసూలు చేసిన రూ.1.40 లక్షల్లో..రూ.80 వేలు ఆ విద్యార్థినికి బదిలీ చేసినట్లు అశ్వారావుపేట కళాశాల విద్యార్థిని అంగీకరించింది.

* వరంగల్ విద్యార్థినిని విచారించినప్పుడు వరంగల్ వ్యవసాయ కళాశాల జూనియర్ అసిస్టెంట్ కార్తిక్ నిర్వాకం బహిర్గతమైంది. జిరాక్స్ తీసే సమయంలో కార్తిక్ ప్రశ్నపత్రాలను ఫొటో తీసి, వాట్సప్‌లో విద్యార్థినికి పంపగా..ఆ విద్యార్థిని ద్వారా వరంగల్, జగిత్యాల, పాలెం, ఆదిలాబాద్, రాజేంద్రనగర్, సిరిసిల్ల, అశ్వారావుపేట కళాశాలల్లోని ఇన్‌సర్వీస్ విద్యార్థులకు చేరినట్లు విచారణ బృందాలు తేల్చినట్టు సమాచారం.

*** మిడ్ ఎగ్జామ్స్ సహా.. మరిన్ని ప్రశ్నపత్రాలు బయటికి**

మూడో సంవత్సరం మొదటి సెమిస్టర్ మిడ్ ఎగ్జామ్స్ ప్రశ్నాపత్రాలు కూడా లీకైనట్లు, సిరిసిల్ల బీజేఆర్ వ్యవసాయ కళాశాలలో పొరుగు సేవల సిబ్బంది అజయ్ వాటిని లీక్ చేసినట్లు అంతర్గత విచారణ బృందం గుర్తించింది. అతని సెల్‌ఫోన్‌ను తనిఖీ చేసే క్రమంలో గతంలో జరిగిన మరికొన్ని సెమిస్టర్ల ప్రశ్నాపత్రాలు అందులో ఉన్నట్లు గుర్తించి విస్తుపోయింది. దీన్నిబట్టి కొన్నేళ్లుగా ఇన్‌సర్వీస్ విద్యార్థులకు సంబంధించిన పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీ కొనసాగి ఉంటుందనే అనుమానాలు బయటపడ్డాయి. సీఐడీ దర్యాప్తులో మరికొందరి పాత్ర బహిర్గతమయ్యే అవకాశాలున్నాయని వర్సిటీ వర్గాలు పేర్కొంటున్నాయి.

## సవాళ్లున్నా సంక్షేమం.. అభివృద్ధే సంకల్పం

ఒకటీ ఒకటీ కలిస్తే ప్రతిసారీ రెండే కానక్కర్లేదు..ఒక్కోసారి అనూహ్యంగా ఎన్నో రెట్ల బలం సమకూరొచ్చు... 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి రాష్ట్రంలో అఖండ విజయం సాధించడంతోపాటు అటు కేంద్రంలోనూ కీలక భాగస్వామిగా మారడం అలాంటిదే. ఆ పరపతితో.. మన సత్తువకు కేంద్ర బలాన్ని జోడించి, పీకల్లోతు అప్పుల్లో ఉన్న ఆర్థిక నావను గట్టెక్కించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శతథా ప్రయత్నిస్తోంది. సంక్షేమంతోపాటు అభివృద్ధిలోనూ సొంత వనరులతోపాటు కేంద్ర పథకాలు చేదోడుగా ముందుకెళుతోంది. ఈ క్రమంలో కేంద్ర బడ్జెట్ కన్నా ముందే ప్రణాళికలు రూపొందించుకుంది. మన ఆకాంక్షలు, అవసరాలపై దిల్లీ పెద్దలతో నిరంతరం సంప్రదిస్తోంది. తాజా కేంద్ర బడ్జెట్‌లో ప్రస్తావించిన పథకాలను రాష్ట్రానికి ఎలా తెచ్చుకోవాలో, ఛాలెంజ్ మోడ్‌లో ఎక్కువ నిధులు ఎలా సాధించుకోవాలో ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. వీటన్నింటినీ శనివారం శాసనసభలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం పదేపదే నొక్కిచెప్పింది. 'కేంద్ర బడ్జెట్ ఆంధ్రప్రదేశ్‌కు ఆశాకిరణంలా ఉంది' అని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సూటిగా చెప్పేశారు. 202627 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శాసనసభలో శనివారం ప్రవేశపెట్టారు. రూ.3,32,205.34 కోట్ల అంచనా వ్యయంతో పద్దును సమర్పించారు. రెవెన్యూ లోటును రూ.22,002 కోట్లకే పరిమితం చేస్తామని పేర్కొన్నారు. ద్రవ్యలోటు రూ.75,868.09 కోట్లుగా ఉంటుందని అంచనా వేశారు. ఆర్థిక మంత్రిగా కేశవ్‌కు ఇది వరుసగా మూడో బడ్జెట్. పేదలకు నేరుగా రూ.వేల కోట్ల నిధులిస్తున్న సంక్షేమ పథకాలకు ఆర్థిక మంత్రి ఈ బడ్జెట్లో పెద్ద పీట వేశారు. సామాజిక పింఛన్లకు పెద్ద మొత్తంలో నిధులిచ్చారు. మహిళలు, బీసీలు, ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి గణనీయమైన కేటాయింపులు చూపారు. సాగునీటి ప్రాజెక్టులు, రోడ్లు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం వంటి రంగాలకు ఎంతో ప్రాధాన్యమిచ్చారు. మరోవైపు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కేంద్ర సహకారం తీసుకుంటామని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్రానికి ఎలా ఉపయుక్తమయ్యే ఆస్కారం ఉందో కూడా ఈ బడ్జెట్‌లో విశదీకరించారు. ఐదేళ్ల వైకాపా అస్తవ్యస్త విధానాల నుంచి రాష్ట్రాన్ని ఎలా గట్టెక్కిస్తున్నామో వెల్లడించారు.

## సిట్టింగ్ జడ్జిలపై ఫిర్యాదుల వెల్లువ

న్యూఢిల్లీ : గత పదేండ్లలో సుప్రీంకోర్టు, హైకోర్టుల సిట్టింగ్ జడ్జిలపై ఎనిమిది వేలకు పైగా ఫిర్యాదులు అందాయి. ఈ విషయా న్ని కేంద్రం లోక్‌సభలో వెల్లడించింది. ఒక సభ్యుడు లేవనెత్తిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర న్యాయ శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ఈ వివరాలు వెల్లడించారు. 2016 నుంచి 2025 వరకు సంబంధించిన సమాచారాన్ని సభకు వివరించారు. కేంద్రం వెల్లడించిన సమాచారం ప్రకారం... సిట్టింగ్ జడ్జిలపై ప్రధాన న్యాయ మూర్తి కార్యాలయానికి 8630 ఫిర్యాదు లు అందాయి. ఇందులో 2024లో అత్యధికంగా 1170, 2020లో కనిష్టంగా 518 ఫిర్యాదులు వచ్చాయి. సభలో డీఎంకేకు చెందిన ఎంపీ మతేస్వరన్ వివిఎస్.. న్యాయమూర్తుల పై అవినీతి, లైంగిక దుర్వినియోగం, ఇతర తీవ్రమైన అక్రమాలపై వచ్చిన ఫిర్యాదుల జాబితాను కోరారు. అలాగే ఆ ఫిర్యాదులపై ఏ చర్యలు తీసుకు న్నారు, వాటి రికార్డులను నిర్వహించే వ్యవస్థ సుప్రీంకోర్టులో ఉందా అని కేంద్రాన్ని ప్రశ్నించారు. ఈ విషయం లో కేంద్ర మంత్రి నుంచి స్పష్టమైన సమాధానం రాకపోవడం గమనార్హం. అయితే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ), హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు 'ఇన్‌హౌస్ ప్రొసీజర్' ప్రకారం ఫిర్యాదులను స్వీకరించే అధికారాన్ని కలిగి ఉన్నారని కేంద్ర మంత్రి తెలిపారు.

## అంతరిక్షంలో డేటా సెంటర్లు

భూమిపై చిన్న చెత్త ముక్క పడి ఉందనుకోండి. పెద్ద ప్రమాదమేమీ లేదు. కానీ, అంతరిక్షంలో పరిస్థితి వేరు. అక్కడ చిన్న శకలం వేగంగా దూసుకొచ్చి ఢీకొడితే పెను ప్రమాదమే సంభవిస్తుంది. రూ.వేల కోట్ల విలువైన ఉపగ్రహాలు, అంతరిక్ష యాత్రలు క్షణాల్లో బూడిదయ్యే ప్రమాదం పొంచి ఉంటుంది. అంతరిక్ష రంగాన్ని రక్షించుకునేందుకు ఇప్పుడు కృత్రిమ మేధ (ఏఐ) కీలకంగా మారుతోంది. ఫిబ్రవరి 1620 వరకూ దిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించనున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026'లో భాగంగా కీలకమైన అంతరిక్ష రంగంపైనా చర్చ జరగనుంది.

**10 లక్షల వ్యర్థ శకలాలు..**

ప్రస్తుతం భూకక్ష్యలో సెంటీమీటరు, అంతకంటే పెద్ద పరిమాణంలో ఉన్న పది లక్షలకు పైగా వ్యర్థ శకలాలు (స్పేస్ డెబ్రిస్) తిరుగుతున్నాయి. వీటిని నిశితంగా గమనించకపోతే భారీ వ్యయంతో కూడిన అంతరిక్ష ప్రయోగాలు ప్రమాదంలో పడే అవకాశముంది. ఈ క్రమంలో భారతీయ స్పేస్ ఇంజినీర్లు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణులు ఏఐ సాయంతో ఈ వ్యర్థాల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

**గణాంకాల స్థానంలో ఏఐ**

'50 కిలోల బరువున్న చిన్న ఉపగ్రహానికి ఏడాదిలో కనీసం 15 సార్లు ప్రమాద హెచ్చరికలు వస్తుంటాయి. అంతరిక్షంలో చురుగ్గా ఉన్న ఉపగ్రహాలు, పనిచేయనివి, విడిపోయిన శకలాలు, ఆఖరికి గ్రహశకలాలనూ ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండటం చాలా ముఖ్యం' అని దిగంతర ఇండస్ట్రీస్ వ్యవస్థాపకుడు, సీఈఓ అనిరుధ్ శర్మ తెలిపారు. సాధారణంగా ఉపగ్రహాలు, వ్యర్థాల గమనాన్ని అంచనా వేసేందుకు ఇప్పటివరకూ గణాంక నమూనాలను వాడుతున్నారు. వారం రోజుల తర్వాత ఒక వస్తువు ఎక్కడ ఉంటుందో కచ్చితంగా అంచనా వేసేందుకు, కక్ష్యలో మార్పులను గుర్తించేందుకు తాము ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసినట్లు అనిరుధ్ వివరించారు. 'కక్ష్యలో రద్దీ పెరుగుతున్న వేళ, ఏఐ అనేది కేవలం ఒక అవసరం మాత్రమే కాదని, ఇది భద్రతకు అత్యవసరమని' ఇండియన్ స్పేస్ అసోసియేషన్ డైరెక్టర్ జనరల్ ఏకే భట్ స్పష్టం చేశారు.

**కచ్చితమైన సమాచారంతో..**

బెంగళూరుకు చెందిన స్టార్టప్ 'పిక్సెల్ స్పేస్'.. ఉపగ్రహ చిత్రాల విశ్లేషణలో ఏఐని విస్తృతంగా వినియోగిస్తున్నట్లు పేర్కొంది. సంస్థ సీఈఓ అవైస్ అహ్మద్ మాట్లాడుతూ.. 'ఉపగ్రహాల నుంచి వచ్చే పెటాబైట్ల కొద్దీ డేటాను వ్యక్తులు విశ్లేషించడం అసాధ్యం. అందుకే, మేం ఏఐని వాడుతున్నామ'న్నారు. సరిహద్దు భద్రత, వ్యవసాయం, పంట దిగుబడి, ఇంధన లీకేజీలు, కాలుష్యం వంటి అంశాలపై మా ఏఐ మోడల్స్ కచ్చితమైన సమాచారాన్ని ఇస్తాయని తెలిపారు.

**స్వయంచాలకంగా...**

భవిష్యత్తులో ఉపగ్రహాలు తమకు తామే ప్రమాదాలను పసిగట్టి, ఢీకొనకుండా తప్పించుకునే 'అటానమస్ శాటిలైట్ ఆపరేషన్స్'పై దిగంతర దృష్టి సారించింది. వచ్చే అయిదేళ్లలో ఈ సాంకేతికత అందుబాటులోకి వస్తుందని అనిరుధ్ శర్మ వెల్లడించారు. ఉపగ్రహాలు ఒకదానితో ఒకటి సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకుంటూ, ప్రమాదాల నుంచి బయటపడతాయని వివరించారు.

* సుహోరా టెక్నాలజీస్ వంటి సంస్థలు మేఘాల అడ్డంకులు తొలగించి, స్పష్టమైన చిత్రాలను అందించేందుకు ఏఐ అల్గారిథమ్‌లను వాడుతున్నాయి. కేవలం జరిగిన విషయాన్ని చెప్పడమే కాకుండా, భవిష్యత్తులో ఏం జరగబోతోందో అంచనా వేసే 'ప్రిడిక్టివ్ మోడల్స్'ను తాము అభివృద్ధి చేస్తున్నట్లు సంస్థ సీటీఓ రూపేష్ కుమార్ తెలిపారు.

* రూ.150 కోట్ల పెట్టుబడితో 'జీఐఎస్ అండ్ ఏఐ కాంపిటెన్సీ సెంటర్'ను ఏర్పాటు చేసినట్లు ఎస్రీ ఇండియా ఎండీ అగేంద్ర కుమార్ తెలిపారు. ఇక్కడ డేటా సైంటిస్టులు, ఏఐ నిపుణులు కలిసి సంక్లిష్టమైన సమాచారాన్ని విశ్లేషిస్తారని పేర్కొన్నారు.

**మూలం నుంచే పరిష్కరించేలా**

'అంతరిక్షాన్ని సురక్షితంగా, సుస్థిరంగా మార్చాలంటే సమస్యను కేవలం పర్యవేక్షిస్తే సరిపోదు. దాన్ని మూలాల నుంచే పరిష్కరించాల్సిన సమయం ఆసన్నమైంది. అంతరిక్షంలో ఒక వస్తువును గుర్తించి, దాని వద్దకు అత్యంత సమర్థమైన మార్గంలో చేరుకోవడానికి మేం ఏఐని విస్తృతంగా వినియోగిస్తున్నాం' అని అంటున్నారు ఇస్రో మాజీ శాస్త్రవేత్త, కాస్మోసర్వ్ స్పేస్ వ్యవస్థాపకుడు, సీఈఓ చిరంజీవి ఫణీంద్ర. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఈ సంస్థ అంతరిక్ష వ్యర్థాలను నేరుగా తొలగించే పరిష్కారాలను రూపొందిస్తోంది. కంప్యూటర్ సిములేషన్ల ద్వారా రూపొందించిన సింథటిక్ చిత్రాలు, ల్యాబ్‌లలో సేకరించిన వాస్తవ డేటాతో ఏఐ మోడళ్లకు శిక్షణ ఇస్తున్నట్లు చిరంజీవి వెల్లడించారు. అంతరిక్షంలో వెలుతురు ఎప్పుడు ఎలా ఉంటుందో ఊహించలేం..

# సప్తగిరి పాఠశాలలో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

ప్రజా స్ఫూర్తి, నల్లగొండ : నల్లగొండ పట్టణంలోని సప్తగిరి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా, అధికారులుగా, డాక్టర్లుగా ప్రజా ప్రతినిధులుగా చక్కటి అభినయాన్ని హుందాతనాన్ని ప్రదర్శించారు. అనంతరం అ పాఠశాల నుండి గడియారం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి పూలే విగ్రహానికి, తెలంగాణ మలి దశ తొలి అమరుడు శ్రీకాంత్ చారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ లింగయ్య యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు తమ విధులను బాధ్యతలను చక్కగా నిర్వహించి భావి భారత పౌరులుగా తాము ఏమి



అవ్వాలనుకున్నారో ఆ పాత్రలను ఉన్నతంగా వ్యవహరించి నిరూపించారని తెలిపారు .విద్యాశాఖ మంత్రి గా నేహా శ్రీ ,ఎమ్మెల్యేలు కే మోహన్, సాయి తరుణ్, సాయికిరణ్, భీమ్, జిల్లా కలెక్టర్ పూజ, జిల్లా ఎస్పీ వంశీ, డీఈవో రామ్ చరణ్, ఎంఈవో ప్రసన్న పాఠశాలను సందర్శించి పరిశీలించడం, తనిఖీలు చేయడం ఆకట్టుకుందని అన్నారు. మా పాఠశాల విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తున్నారని మీ పిల్లలను మా పాఠశాలలో చేర్పిస్తే ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్ది విజ్ఞానవంతులుగా చేస్తామన్నారు. అనంతరం ఉపాధ్యాయుల వ్యవహరించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సైదులు, ఉపాధ్యాయులు మూర్తి, నరసింహ, శంకర్, గౌస్, శ్రీకాంత్, ఫాహిమా, సరిత, ధనలక్ష్మి, కళ్యాణి, నాగమణి విద్యార్థులు పాల్గొన్నారు.

## మహా శివరాత్రి వేడుకలకు హాజరు కావాలని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఆహ్వానం





కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 17వ డివిజన్ లో గల శ్రీ వెంకట శివ రామాలయంలో నిర్వహిస్తున్న మహా శివ రాత్రి వేడుకలకు ముఖ్యఅతిథిలుగా హాజరు కావాలని శనివారం ఎమ్మెల్సీ శంభిపూర్ రాజుని , కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కే. పి వివేకానంద్లను ఆలయ ధర్మకర్త 17వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ మర్యాద పూర్వకంగా కలసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారిని దర్శించుకుని స్వామి వారి కృపకు పాత్రులు కావాలన్నారు.

## కెటిఆర్, హరీష్ రావు లను మర్యాదపూర్వకంగా కలిసిన పాండాల శివకుమార్ గౌడ్



ప్రజాస్ఫూర్తి, కాప్రా : బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి సిద్దిపేట్ ఎమ్మెల్యే హరీష్రావులను శనివారం వారి నివాసంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలసి బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పాండాల శివకుమార్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఈనెల 22వ తేదిన చర్లపల్లి డివిజన్ రెడ్డి కాలనీలోని తన నూతన గృహ ప్రవేశానికి హజరు కావాలని అహ్వాన పత్రికను అందజేశారు. సానుకులంగా స్పందించిన కెటిఆర్, హరీష్రావు లు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నేమూరి మహేష్ గౌడ్, బుచ్చన్నగారి శ్రీకాంత్ రెడ్డి , గూడురిమహేష్ గౌడ్, శంకర్, రమేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.


## మహా శివరాత్రికి ముస్తాబైన కాశీ విశ్వనాథ ఆలయం



మల్కాజిగిరి, ప్రజా స్ఫూర్తి : నేరేడ్మెట్ శివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మల్కాజిగిరి పరిధిలోని శివాలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆయా ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయాలకు రంగులు వేశారు. ఓల్డ్ నేరేడ్మెట్ శ్రీ అన్నపూర్ణ సహిత కాశీ విశ్వనాద ఆలయంలో శివ రాత్రి సందర్భంగా చలువ పందిళ్లు వేయడంతో పాటు ఆలయ ప్రాంగణాన్ని విద్యుద్దీపాలతో తీర్చిదిద్దారు. విద్యుద్దీపాల అలంకరణలో శివాలయం శనివారం నుంచి సోమవారం వరకు పలు కార్యక్రమాలను నిర్వహించనున్నారు ఉదయం గణపతి పూజ, అఖండదీపారాధన, మూల విగ్రహానికి ప్రత్యేక అభిషేకం. 15న సుప్రభాత సేవ, అమ్మవారికి ప్రత్యేక పూజలు, మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, సామూహిక అర్చనలు, లింగో ద్భవ సమయంలో పలు రకాల ద్రవ్యాలతో అభిషేకం. 16న తెల్లవారుజామున పార్వతి పరమేశ్వరుల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సీతారాంనగర్లో కొలువు దీరిన అన్నపూర్ణ సహిత కాశి విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 4.30గంటలకు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకంతో ప్రారంభమయ్యే శివరాత్రి వేడుకలు రాత్రి 12గంటలకు లింగోద్భవ దర్శనం, రాత్రి 12. 31 గంటలకు శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి కల్యానోత్సవంతో ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## ముఖ్యమంత్రి సహయ నిధి నిరుపేదల పాలిటా వరం

* **బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : ముఖ్యమంత్రి సహయ నిధి నిరుపేదల పాలిటా వరమని బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. ఎముకమజ్జ మార్పిడి చికిత్స పొందుతున్న రాజీవ్ గాంధీ నగర్, బాచుపల్లి నివాసి బి. ఆనంద్కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 3.25 లక్షల ఎల్ఓసి చెక్కును శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన చికిత్స కోసం ఎదురు చూసేవారు ఎల్ఓసి విధానాన్ని దరఖాస్తు చేసుకొని చికిత్స పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, పార్టీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, మాజీ కోఆప్షన్ సభ్యుడు సతీష్, మాజీ కార్పొరేటర్లు రాఘవేంద్ర రావు, సుజాత, శెనిగల ప్రమీల యాదవ్, సాంబశివ రెడ్డి, ప్రవీణ్ గౌడ్, దుండిగల్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సకల అభివృద్ధులకు విద్యే మూలం...

* **పదో తరగతి ఫలితాల మెరుగుదలపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సకల అభివృద్ధులకు విద్యే మూలమనే నమ్మకంతో భద్రాద్రికొత్తగూడెం జిల్లా కలెక్టర్ ప్రారంభం నుంచే విద్యాశాఖపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో గత సంవత్సరాలతో పోలిస్తే మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో పలు చర్యలు చేపట్టారు. జిల్లా స్థాయిలో అన్ని హెచ్ఎమ్లతో సమావేశం నిర్వహించి పదో తరగతి ఫలితాలపై సమగ్ర సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వెనుకబడిన పాఠశాలలకు ప్రత్యేక లక్ష్యాలను నిర్దేశించారు. పరీక్ష విధానాలు, ప్రశ్నపత్ర నమూనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే సిలబస్ పూర్తి స్థాయిలో బోధన జరుగుతున్నదా అనే విషయంపై పాఠశాల వారీగా సమీక్షలు నిర్వహించి ఉపాధ్యాయులకు అవసరమైన మార్గనిర్దేశం చేశారు. మాదిరి పరీక్షలను పబ్లిక్ పరీక్షల మాదిరిగానే కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. సబ్జెక్టు నిపుణులచే ముఖ్యాంశాలపై డివిజన్ వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. కేజీబీవీలలో విద్యార్థుల ఫలితాలను మెరుగుపర్చేందుకు సైకాలజిస్ట్ డాక్టర్ దయాల్ను కౌన్సిలర్గా నియమించారు. అదేవిధంగా ఎస్ఏ 1, ఎస్ఏ 2 సిలబస్లపై పరీక్షలను విధిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## ప్రారంభమైన మాణిక్య ప్రభు శివరాత్రి బ్రహ్మోత్సవాలు

* **ఘనంగా గ్రామ దేవతలకు భోనాలు...**



అందోలు, ప్రజాస్ఫూర్తి: అందోలు మండల పరిధిలోని కన్ సాన్ పల్లి గ్రామంలోని మాణిక్ ప్రభు దేవాలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం కీ॥శే॥ నిర్గుణానంద మాణిక్య శివ సుభాష్ ఆర్యులకు గురు పూజ, రుద్రాభిషేకం, నందిధ్వజం, గ్రామ దేవత పోచమ్మ మంహకాళి, దుర్గమ్మ తల్లులకు బోనాలు నిర్వహించారు. బోనాల కార్యక్రమంలో మహిళ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కంకణాధారణ, ఆంజనేయస్వామి సింధూరపు పూజ, మాణిక్య ప్రభు గదే పూజ, తీర్థప్రసాధ వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా ఆదివారం కోటి లింగేశ్వర స్వామికి అభిషేకం, లింగోద్భవ, అన్నపూజ, తీర్థప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించబడును. సోమవారం ఉ॥1115ని॥లకు శ్రవణా నక్షత్ర శ్రీ గంగాగౌరి సమేత కోటి లింగేశ్వర స్వామి వారికి కళ్యాణం జరుగును. ఇట్టి కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు అన్నదానం చేయబడును మరియు అదే రోజున రా. 715ని॥ లకు నంది వాహనంపై కోటి లింగేశ్వర స్వామి రథంపై పురవిధులలో ఉరేగింపు తీయబడును. రా. 1015ని॥లకు స్వామి వారికి మంగళహారతితో రథం తిరిగి యాధాస్థానముకు చేరును. 18న బుధవారం ఉ 1115ని॥లకు అభిషేకం, కంకణ విసర్జన, తీర్థప్రసాదములు, మంగళ హారతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇట్టి ఉత్సవాలలో భక్తులందరు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని కోరారు.

## రాష్ట్ర స్థాయి సీఎం కప్కు కొత్తగూడెం క్రీడాకారుల ఎంపిక

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం పట్టణానికి చెందిన ముగ్గురు యువ రెజ్లర్లు రాష్ట్రస్థాయి సీఎం కప్ రెజ్లింగ్ ఛాంపియన్షిప్కు ఎంపిక కావడం జిల్లా క్రీడా రంగానికి గర్వకారణంగా మారింది. త్రీ ఇంక్లైన్, ధన్బాద్ గ్రామపంచాయతీ ప్రాంతాలకు చెందిన కే.లిఖిత్ చరణ్, వి.సాయి శృతి, వి.శరణ్యలు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి సీఎం కప్ రెజ్లింగ్ పోటీల్లో ఈ క్రీడాకారులు స్వర్ణ పతకాలు సాధించారు. 48 కేజీల విభాగంలో కే.లిఖిత్ చరణ్, 62 కేజీల విభాగంలో వి.సాయి శృతి, 46 కేజీల విభాగంలో వి.శరణ్య మొదటి స్థానంలో నిలిచి జిల్లా జట్టులో స్థానం దక్కించుకున్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను 2 టౌన్ సీఐ డి.ప్రతాప్ అభినందించారు. రాష్ట్రస్థాయిలోనూ మెరుగైన ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.




ప్రతిభావంతులైన క్రీడాకారులకు పోలీసు శాఖ తరఫున ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.కాశీ హుస్సేన్, ఉపాధ్యక్షులు ఐ.ఆదినారాయణ, జాతీయ రెజ్లింగ్ క్రీడాకారిణి పి.నిహారిక తదితరులు పాల్గొన్నారు.

## ఆకాశవాణిలో ఘనంగా "రేడియో కిసాన్ దివాస్"

* **సమీకృత వ్యవసాయంతో అధిక లాభాలు: అధికారులు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఆకాశవాణి కొత్తగూడెం కేంద్రంలో శనివారం "రేడియో కిసాన్ దివాస్" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం సందర్భంగా రేడియో కేంద్రం ప్రాంగణంలో ఔషధ, పూల మొక్కలతో ఏర్పాటు చేసిన "ప్రకృతి మాత గ్రీన్ గార్డెన్"ను స్టేషన్ ప్రోగ్రామ్ హెడ్ కొలిపాక శంకరరావు ప్రారంభించారు. అనంతరం జరిగిన సభకు కొలిపాక శంకరరావు అధ్యక్షత వహించగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి. బాబురావు, కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ టీ. భరత్, జిల్లా మత్స్యశాఖ అధికారి ఇంతియాజ్ అహ్మద్, రామవరం పశువైద్యులు డాక్టర్ జి. ఆనందరావు, పలువురు ఆదర్శ రైతులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే సమీకృత వ్యవసాయం అత్యంత అవసరమని తెలిపారు. పంటలతో పాటు చేపలు, కోళ్లు, మేకలు తదితర ఉపాధి మార్గాలను అనుసరిస్తే రైతులకు అధిక లాభాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. రైతులను చైతన్యవంతులు చేయడంలో రేడియో ద్వారా ప్రసారం చేస్తున్న వ్యవసాయ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. రేడియో కార్యక్రమాల ద్వారా సాంకేతిక వ్యవసాయ పద్ధతులు రైతులకు చేరడంతో పంటల సాగు విధానంలో మార్పులు వచ్చాయని, దిగుబడులు పెరుగుతున్నాయని ఆదర్శ రైతులు వెల్లడించారు. కిసాన్ దివాస్ సందర్భంగా పలువురు అభ్యుదయ రైతులు, అధికారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆదర్శ రైతులు గొట్టిపాటి వెంకటేశ్వర్లు, నర్సిరెడ్డి, క్రీస్తు రాజు, సందీప్, హనుమా, మొక్కల పెంపకదారులు నూర్వి రాజశేఖర్, ప్రకృతి హరిత దీక్షరాలు నైనిక రజువా, రామంచి శ్రీనివాస్, రేడియో స్టేషన్ ఇంజనీరింగ్ సిబ్బంది బాబు సింగ్, సుమన్, ఆనంద్, కోటేశ్వరరావు, రేడియో జాకీలు తదితరులు పాల్గొన్నారు.

## పంచశీల స్కూల్ లో ఘనంగా మహా శివరాత్రి వేడుకలు




మూసాపేట, ప్రజాస్ఫూర్తి : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా మూసా పేట లోని పంచశీల స్కూల్ లో మహా శివరాత్రి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శివపార్వతుల వేషధారణలో ఆకట్టుకున్నారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు పండుగల ప్రాముఖ్యతను తెలియజేసేందుకు ప్రతి యేటా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి పరిరక్షణతోనే జీవరాశి రక్షణ

**– డా. జయరాజ్ పిలుపు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రకృతి నాశనం వల్ల భూమిపై జీవరాశి అంతరించిపోవే ప్రమాదం ఉందని ప్రముఖ ప్రకృతి కవి డా. జయరాజ్ హెచ్చరించారు. విజ్ఞాన దర్శిని, దీ నెహ్రూ సెంటర్, నేచర్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న విజ్ఞాన యాత్రలో భాగంగా కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యాన్ని నిలబెట్టేందుకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా క్యాన్సర్ వంటి వ్యాధులను తగ్గించవచ్చని తెలిపారు. విజ్ఞాన దర్శిని వ్యవస్థాపకుడు రమేష్ మాట్లాడుతూ, సైన్స్టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్నప్పటికీ మనుషుల్లో ఆచరణాత్మక జ్ఞానం తగ్గిందన్నారు. చదువులతో పాటు సమాజాన్ని అర్థం చేసుకుని సైన్స్ను జీవితంలో అమలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా డా. జయరాజ్, రమేష్శోభారాణి దంపతులు, అవయవదాన అవగాహన కల్పిస్తున్న ఈశ్వర్ లింగంను సన్మానించారు. కార్యక్రమంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.


## శంకర్ పల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ పదవిని మాదిగ లకు ఇవ్వాలి

* **ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కాడిగల్ల ప్రవీణ్ కుమార్..**



శంకర్ పల్లి , (ప్రజాస్ఫూర్తి ):శంకర్ పల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్సీ మాదిగ కులానికి చెందిన వారికి ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కాడిగల్ల ప్రవీణ్ కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. నేటి వరకు శంకర్ మండలంలో ఎంపీపీ, జెడ్పీటీసీ అవకాశం ఇవ్వలేదు కావున ఈ సారి శంకర్ పల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి మాదిగ కులానికి ఇవ్వాలి అని రంగారెడ్డి జిల్లా మంత్రి శ్రీధర్ బాబు ఎమ్మెల్యే కాలే యాదయ్య, కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి భీమ్ భారత్ విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేస్తామని ప్రవీణ్ కుమార్ అన్నారు.

## మహాశివరాత్రి పర్వదినం ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించే పవిత్రమైన రోజు బిఆర్ఎస్ఎల్పీ విప్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని నిజాంపేట్ శ్రీ మాత నల్ల పోచమ్మ తల్లి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ శ్రీ శక్తానందాగిరి స్వామి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన పంచభూత లింగార్చన మహోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామీజీ ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ, మహాశివరాత్రి పర్వదినం ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించే పవిత్రమైన రోజు అని పేర్కొన్నారు. పంచభూత లింగార్చన ద్వారా ప్రకృతి తత్వాల పట్ల మనలో గౌరవభావం పెంపొందుతుందని, సమాజంలో శాంతి, ఐక్యతలు నెలకొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, నిజాంపేట సర్కిల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగ రాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు రాఘవేంద్రరావు, పెద్దిరెడ్డి సుజాత, బొర్రా దేవి చందు ముదిరాజ్, మాజీ కోఆప్షన్ సభ్యులు చంద్రగిరి సతీష్, మాజీ సర్పంచ్ నాగేష్ చారి, దుండిగల్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు సాంబశివరెడ్డి, అజయ్ చౌదరి, మేకల మధుసూదన్, విష్ణువర్ధన్ రెడ్డి, ప్రదీప్, అజయ్ చౌదరి, బిక్షపతి, బొబ్బ శ్రీనివాస్, జశ్వంత్, సాయి, మహిళా నాయకురాలు లలిత భక్తులు, స్థానికులు పాల్గొన్నారు..

# సింగరేణి డాక్టర్ల నిర్లక్ష్యం ఖరీదు... యువకుడు నవీన్ ప్రాణం బలి..

* అంబులెన్స్ లో ఎస్కార్ట్ లేకుండా హైదరాబాద్ కు రిఫర్ చేసారు..
* ఊపిరాడక మార్గమధ్యంలోనే ప్రాణంవదిలిన వైనం
* సింగరేణి వైద్యం గొప్పలు ప్రచారానికే పరిమితం



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి వైద్య సేవల నిర్లక్ష్యంతో యువకుడు ప్రాణాలు కోల్పోయిన ఘటన వెలుగుచూసింది. కొత్తగూడెం 5 షాఫ్ట్‌లో పనిచేస్తున్న ఉద్యోగి బాల నాగేశ్వరరావు కుమారుడు నవీన్ (29)ను తీవ్ర అనారోగ్యంతో స్థానిక సింగరేణి ప్రధాన ఆసుపత్రి నుంచి చికిత్స కోసం హైదరాబాద్ కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.మూడేళ్లుగా క్యాన్సర్‌తో బాధపడుతున్న నవీన్‌కు ఊపిరితిత్తులు, ఎముకల క్యాన్సర్ ఉన్నట్లు సమాచారం. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు రిఫర్ చేసిన వైద్యులు అంబులెన్స్‌లో తగిన వైద్య సిబ్బంది, ఆక్సిజన్ సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఖమ్మం సమీపంలోని పల్లిపాడు వద్ద ఊపిరాడక అంబులెన్స్‌లోనే నవీన్ మృతి చెందాడు. హైదరాబాద్ వైద్యుల సూచన మేరకు ఇవ్వాల్సిన ఇంజక్షన్లను కూడా సింగరేణి వైద్యులు నిర్లక్ష్యం చేశారని తల్లిదండ్రులు తెలిపారు. ఈ ఘటనపై ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) నాయకులు ఆసుపత్రి వద్ద నిరసన చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఎమర్జెన్సీ కేసుల్లో అంబులెన్స్‌లో శిక్షణ పొందిన సిబ్బంది, సీఆర్‌పీ, ఆక్సిజన్ వంటి సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాలని యూనియన్ నాయకులు వంగ వెంకట్, హుమాయూన్ పేర్కొన్నారు.

## నిజమైన ఖాతాదారుల సమస్యలను పరిష్కరించేందుకు డీఫ్రీజ్ ఖాతాల మేళా

* సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ డీసీపీ టి. సాయి మనోహర్



సైబరాబాద్, ప్రజాస్ఫూర్తి : నిజమైన ఖాతాదారుల సమస్యలను పరిష్కరించేందుకు, వారికి త్వరితగతిన న్యాయం చేసేందుకు ఈ ప్రత్యేక డీఫ్రీజ్ ఖాతాల మేళాను నిర్వహించామని సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ డీసీపీ టి. సాయి మనోహర్ అన్నారు. సైబర్ నేరాల దర్యాప్తులో భాగంగా బ్యాంక్ అకౌంట్ ఫ్రీజ్ అయిన ఖాతాదారులకు ఉపశమనం కల్పించేందుకు శనివారం సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్ లోని ఆడిటోరియం లో నిర్వహించిన ప్రత్యేక “డీఫ్రీజ్ ఖాతాల మేళా”లో NOC లు అందజేశారు. సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ డీసీపీ టి. సాయి మనోహర్ మాట్లాడుతూ.. ఈ మేళా సందర్భంగా ఎన్సీఆర్పీ ద్వారా ఫ్రీజ్ చేసిన 110 బ్యాంక్ ఖాతాలను పరిశీలించి ఖాతాదారుల వివరాలు, లావాదేవీలపై సైబర్ క్రైమ్స్ పోలీసులు సవివరంగా ధృవీకరణ, విశ్లేషణ నిర్వహించామని తెలిపారు. నిజమైన ఖాతాదారులను గుర్తించి, చట్టపరమైన విధానాలను అనుసరించి వారి ఖాతాలను డీఫ్రీజ్ చేశామన్నారు. ఖాతాదారులకు సురక్షిత బ్యాంకింగ్ విధానాలు, ఖాతాల దుర్వినియోగాన్ని నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అసలైన ఖాతాదారులకు ఉపశమనం లభించడంతో పాటు, సైబర్ నేరస్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సైబర్ మోసాల కేసుల్లో బాధితులు వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్ 1930 కు కాల్ చేయడం లేదా జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ లో ఫిర్యాదు నమోదు చేయాలన్నారు. ఈ ఫిర్యాదుల ఆధారంగా, మోసానికి సంబంధం ఉన్న అనుమానిత లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలను గుర్తించి, మోసపోయిన డబ్బు మరింతగా మళ్లించకుండా, బాధితుల నిధులను రక్షించేందుకు వెంటనే ఫ్రీజ్ చేస్తారన్నారు. ఈ దర్యాప్తు ప్రక్రియలో భాగంగా, కొన్ని బ్యాంక్ ఖాతాలు లావాదేవీల సంబంధాల కారణంగా ముందస్తు చర్యగా ఫ్రీజ్ చేసినప్పటికీ, ఆ ఖాతాదారులు నేరుగా మోసాలకు సంబంధం లేని వ్యక్తులని గుర్తించామని తెలిపారు. ఎన్‌ఓసిష అందుకున్న ఖాతాదారులు సంతోషం వ్యక్తం చేశారు. సైబర్ మోసం జరిగిన వెంటనే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. https://www.cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలన్నారు. బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటీపీ లు లేదా వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దన్నారు. అనుమానాస్పద కాల్స్, మెసేజ్‌లు లేదా ఆన్‌లైన్ ఆఫర్లపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్స్ ఏసీపీ రవీందర్ రెడ్డి, సైబర్ క్రైమ్స్ ఇన్ స్పెక్టర్లు విజయ్ కుమార్, శివప్రసాద్, దుర్గా రామలింగప్రసాద్, రామిరెడ్డి, రాఘవేందర్, మధు, సైబర్ క్రైమ్స్ సబ్ ఇన్ స్పెక్టర్లు చంద్రశేఖర్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వైజ్ఞానిక దృక్పథంతోనే మానవ ప్రగతి సాధ్యం

* విజ్ఞాన దర్శిని వ్యవస్థాపక అధ్యక్షులు రమేష్, ప్రజా కవి జయరాజు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: వైజ్ఞానిక దృక్పథంతోనే మానవ ప్రగతి సాధ్యమని విజ్ఞాన దర్శిని వ్యవస్థాపక అధ్యక్షులు టి.రమేష్, ప్రముఖ ప్రజాకవి, కాళోజీ అవార్డు గ్రహీత జయరాజులు అన్నారు. శనివారం సుజాతనగర్ మండలం వేపలగడ్డలోని అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో ప్రకృతి, రాజ్యాంగం, సైంటిఫిక్ టెంపర్ పట్ల అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ దయాకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సదస్సునకు రమేష్, జయరాజు లు ముఖ్య అతిధులుగా హాజరై మాట్లాడుతూ ప్రకృతిని, వైజ్ఞానిక దృక్పథాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో జనవరి 27న విజ్ఞాన దర్శిని ది నెహ్రూ సెంటర్, నేచర్ ఫౌండేషన్ సంస్థల ఆధ్వర్యంలో సోమశిలలో ప్రారంభించిన ప్రకృతి విజ్ఞాన యాత్ర అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కాలేజీకి చేరుకోవడం సంతోషంగా ఉందన్నారు. నేడు విద్యార్థులకు సైంటిఫిక్ టెంపర్ ఉండటం లేదని, మనిషి విశ్వాంతరాల్లోకి ప్రయాణిస్తున్నా మూఢ నమ్మకాలు కూడా వెంటనే ప్రయాణిస్తున్నాయని అన్నారు. వీటిని వీడి శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని వారు విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రమేష్, శ్రీకాంత్, బాబురావు, లక్‌పతి, నేత్ర, శరీర, అవయవ దాన ప్రోత్సాహక సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గంజి ఈశ్వర లింగం, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కాళంగి హరిక్రిష్ణ, విజ్ఞాన దర్శిని రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ అలీ, ప్రకృతి ఆశ్రమం కన్వీనర్ సుగుణ రావు, మొక్కల రాజశేఖర్, సింగరేణి రిటైర్డ్ జిఎం రమేష్, బిక్కులాల్, యోగా ఇన్‌స్ట్రక్టర్ కె.కమలా రాణి, తదితరులు పాల్గొన్నారు.

* మొక్కల పెంపకం ఆవశ్యకతను తెలియజేసిన నైనిక రజువా

ప్రకృతి విజ్ఞాన యాత్ర కొత్తగూడెంకు చేరుకున్న సందర్భంగా అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన సదస్సు సందర్భంగా ప్రకృతి హరిత దీక్షకురాలు నైనిక రజువా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రకృతిని కాపాడుకోవాల్సిన విధానం గురించి వివరిస్తూ, మొక్కల పెంపకం ఆవశ్యకతను తెలియజేస్తూ వీపునకు మొక్కను కట్టుకుని ఆక్సీజన్ మాస్క్ ద్వారా భవిష్యత్తులో రాబోయే అవాంతరాల గురించి తెలియపరుస్తూ అవగాహన కల్పించిన తీరు అక్కడ ఉన్నవారందరినీ ఆలోచింపచేసింది. నైనిక రజువా చేస్తున్న ఈ నిస్వార్థ సేవను సభకు హాజరైన విజ్ఞాన దర్శిని వ్యవస్థాపక అధ్యక్షులు రమేష్, ప్రజా కవి జయరాజులు అభినందించారు. ఈ సందర్భంగా నైనిక రజువాను వేదికపైకి ఆహ్వానించి డాక్టర్ జయరాజు రచించిన ‘అవని’, విశ్వ వేదికపై స్వామి వివేకానంద, జన విజ్ఞాన వేదిక ప్రచురించిన ఆహార పదార్థముల కల్తీ - కనుగొను విధానము - ప్రమాదాలు అనే పుస్తకాలను బహుమతిగా అందించి సత్కరించారు.

### నన్ను నమ్మి ఓటు వేసిన
## ప్రతి ఓటరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు

* యానాల కర్ణాకర్ రెడ్డి.




ప్రజా స్ఫూర్తి, నల్గొండ : నల్గొండ జిల్లా కేంద్రంలోని 41 డివిజన్ మున్సిపల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ తరపున పోటీ చేసే అవకాశం ఇచ్చిన పార్టీ నాయకులకు , అతి తక్కువ సమయంలో విశేష ప్రజాదరణ అందించిన ప్రజలకు ,ముఖ్యంగా నన్ను నమ్మి ఓటు వేసిన ప్రతి ఓటరికీ,,నిరంతరం నా వెంటే నిలిచిన పార్టీ కార్యకర్తలకు ,ధైర్యంగా స్వార్ధంగా పనిచేసిన బూత్ స్థాయి నాయకులకు ,నన్ను ప్రోత్సహించిన పెద్దలు ,యువత ,మహిళా శక్తికి హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ ఎన్నికల ప్రక్రియలో ప్రజాస్వామ్య విలువలు, ప్రజల సమస్యలు ,స్థానిక అవసరాలు మరింత లోతుగా తెలుసుకునే అవకాశం లభించింది. ప్రజలు ఇచ్చిన తీర్పుని గౌరవిస్తూ భవిష్యత్తులో డివిజన్ అభివృద్ధి కొరకు, పారదర్శక పాలన, అవినీతి రహిత పాలన ,సమన్యాయం వంటి అంశాలపై గొంతుగా నిలబడ తాననీ, పాలకపక్షం ప్రజల ఆకాంక్షలకు స్పందించేలా, ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రశ్నిస్తూనే ఉంటామని ,ఈ ఫలితాల వల్ల నా ధైర్యం ఏమి తగ్గలేదని ,పార్టీ పటిష్ఠత కోసం కార్యకర్తల మనోబలాన్ని పెంచడానికి ,రాబోయే ఎన్నికల్లో బిజెపి పార్టీ మరింత బలంగా నిలవడానికి నేను నిరంతరం ప్రజల్లోనే ఉంటానని ,ప్రజల సేవే నా లక్ష్యంగా ,ప్రజల నమ్మకమే నా బలం, మేము ప్రకటించిన మేనిఫెస్టోను, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందుబాటులోకి తెస్తూ డివిజన్ అభివృద్ధికి నిరంతరం తోడ్పడతామని తెలుపుతూ తదుపరి ప్రణాళికలను ముఖ్య కార్యకర్తల సమావేశానంతరం ప్రకటిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో యానాల కర్ణాకర్ రెడ్డి తో పాటు పోరెడ్డి సురేందర్ రెడ్డి ,కంచర్ల విద్యాసాగర్ రెడ్డి ,చిట్టిపోలు సత్యనారాయణ , పగిడోజు హైమావతి, నల్ల వంశి గౌడ్ తొగిటి అనుదీప్ తోగిటి శ్రీనివాసచారి నాగులపాటి మహేందర్ పల్లె శ్రీనివాస్ గౌడ్, యానాల కీర్తన తదితరులు పాల్గొన్నారు.

### చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో సైన్స్ పై
## ఆసక్తి పెంపొందించుకోవడం ఎంతో అవసరం

* బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్







జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే సైన్స్ పై ఆసక్తి పెంపొందించుకోవడం ఎంతో అవసరమని బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. శనివారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి,మగ్దూమ్ నగర్ భగత్ సింగ్ మార్గ్ లోని శ్రీ సాయి విద్యనికేతన్ పాఠశాలలో ఏర్పాటుచేసిన “వైజ్ఞానిక ప్రదర్శన 2026” ను ఆయన తోపాటు తాజా మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ ట్రస్మా మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి,పాఠశాల చైర్మన్, కరస్పాండెంట్ బిర్రు ఆంజనేయులు,డైరెక్టర్ బిర్రు శోభారాణి లతో కలిసి జ్యోతి ప్రజ్వల చేసి ప్రారంభించారు. అనంతరం వారు విద్యార్థుల రూపొందించిన నమూనా లను పరిశీలించి,వారి ప్రతిభను ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లోని సృజనాత్మకతను,పరిశోధన దృక్పథాన్ని పెంపొందిస్తాయన్నారు.. ఇలాంటి సైన్స్ ఫెయిర్‌లు విద్యార్థులలో సృజనాత్మకతను, పరిశోధనా దృక్పథాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులను అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా విద్యార్థులకు ఉత్తమ విద్య అందించాలని సూచించారు. మాజీ కార్పొరేటర్ కే.జగన్ మాట్లాడుతూ విద్యతోపాటు శాస్త్ర,సాంకేతిక రంగాలలో రాణించి దేశప్రతిష్ట ను ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. నేటి విద్యార్థులే రేపటి భావిభారత నిపుణులు కావాలని ఆ దిశగా తల్లిదండ్రులు,పాఠశాల అధ్యాపక బృందం ప్రోత్సహించాలన్నారు. పాఠశాల చైర్మన్, కరస్పాండెంట్ బిర్రు ఆంజనేయులు మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివే విద్యార్థుల మనోభావాలక నుగుణంగా వ్యక్తిగత శ్రద్ధ తీసుకుంటూ విద్యతోపాటు పలు రంగాలలో శిక్షణనిస్తూ సమాజం గర్వించే విధంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అనంతరం పాఠశాలలో నూతనంగా ఏర్పాటుచేసిన “రోబోటిక్ ల్యాబ్ “ను వారు లాంఛనంగా ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులు,సాంకేతిక ఆవిష్కరణలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన 150 కి పైగా నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల కరస్పాండెంట్లు బలరాం యాదవ్,కాయితి శ్రీనివాసరెడ్డి,గడ్డమీది బాలరాజు గౌడ్,చెప్యాల నరసింహులు గౌడ్, ఉపాధ్యాయులు ప్రశాంతి, ప్రసన్న,అన్నే ఫాతిమా,కృష్ణవేణి, సరళ, మహేశ్వరి, సాజిత, షాహిన్, సుభాషిణి, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, సీనియర్ నాయకులు బాబుగౌడ్, దోపతి సంపత్ రెడ్డి, సునీల్ రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


## అమర వీరుల ప్రాణాలు వెలకట్టలేనివి

* పీఏసీ చైర్మన్ , ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



శేరిలింగంపల్లి, ప్రజాస్ఫూర్తి : అమర వీరుల ప్రాణాలు వెలకట్టలేనివని పీఏసీ చైర్మన్ , ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన ఆ వీరులను స్మరించుకుంటూ యువ ఫర్ తెలంగాణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని ఎ.ఎస్ రాజు నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్ లో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన తో పాటు తాజా మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ లు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూపాక్ ఉగ్రమూకల దాడిలో 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు నేలకొరిగి, అమరులైన బ్లాక్ డే రోజు ఈ రోజు అని అన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమర వీరులను స్మరించుకుంటూ వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ, వారికి ఘన నివాళులర్పిస్తున్నాం అని అన్నారు. యువ ఫర్ తెలంగాణ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో మహా రక్త దానం శిబిరం నిర్వహించడం వారికి మనం ఇచ్చే ఘన నివాళులు అని , యువ ఫర్ తెలంగాణ ఫౌండేషన్ వారు అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయం అని అన్నారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, రక్తదానం చేసిన వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేసారు. స్వచ్ఛంధంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం చాలా సంతోషకరమైన విషయం అని, మంచి స్పందన వచ్చినది అని ,అన్ని దానంల కన్నా రక్తదానం గొప్పది అని, ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యత గా తప్పనిసరిగా రక్తదానం చేయాలని, నిండు ప్రాణాలను కాపాడినవారు అవుతారు అని అన్నారు. రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ఇతర ప్రాణాలు కాపాడిన దైవ సమానులు అవుతారు అని కావున ప్రతి ఒక్కరు స్వచ్ఛంద గా ముందుకు వచ్చి రక్తదానం చేయాలన్నారు. యువ ఫర్ తెలంగాణ ఫౌండేషన్ స్టేట్ కన్వీనర్ గవ్వల భారత్ కుమార్, హైదరాబాద్ కన్వీనర్ రుద్ర అభిరామ్ గౌడ్, కో కన్వీనర్ శివ గౌడ్, ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, యువనేత దొడ్ల రామ కృష్ణ గౌడ్, సంజీవ రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, గోపాల్, శివరాజ్ గౌడ్, గుడ్ల శ్రీనివాస్, పోశెట్టిగౌడ్, అగ్రవాసు, దాతి రమేష్, నిరంజన్, సూరిబాబు, నవాజ్, లింగం, సుధాకర్, నాగరాజు, మహేష్, ఖలీమ్, సుధాకర్, రవీందర్, హనుమంతు, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

## ఐటీ కారిడార్లో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు రోడ్ల విస్తరణకు కసరత్తు



సైబరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో రోడ్డు విస్తరణ పనులపై దృష్టి సారించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కీలక మార్గాల్లో నెలకొన్న బాటిల్‌నెక్‌లను తొలగించి, రోడ్డు భద్రతను మెరుగుపరిచేందుకు శనివారం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీజన, జలమండలి అధికారి అశోక్ రెడ్డి, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ భోర్కడే హేమంత్ సహదేవరావు , ట్రాఫిక్ 1 డీసీపీ జె. రంజన్ రతన్ కుమార్‌తో పాటు టీజీఐఐసీ జోనల్ మేనేజర్ ఎం. కవిత వివిధ శాఖల ఉన్నతాధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాదాపూర్ లెమన్ ట్రీ హోటల్ నుంచి సైబర్ టవర్స్ వరకు, అక్కడి నుంచి మెడికోవర్ ఆస్పత్రి వరకు ఉన్న రహదారులను అధికారులు పరిశీలించారు. మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుర్గం చెరువు, నెక్టర్ గార్డెన్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సాఫీగా సాగకుండా అడ్డుపడుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. రహదారి వెడల్పునకు ఆటంకంగా ఉన్న ఆక్రమణలు, విద్యుత్ స్తంభాలు, నీటి పైప్‌లైన్ల వంటి యుటిలిటీల మార్పుపై ఆయా శాఖల మధ్య సమన్వయం ఉండాలని అధికారులు ఆదేశించారు. పనులు జరిగే సమయంలో వాహనదారులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడమే లక్ష్యమన్నారు. ఈ విస్తరణ పనుల ద్వారా ఐటీ కారిడార్‌లో మౌలిక సదుపాయాలు మెరుగుపడటమే కాకుండా, ప్రయాణికుల భద్రత కూడా పెరుగుతుందని అధికారులు వెల్లడించారు.

## విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో కూడా రాణించాలి

* బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పీ. వివేకానంద్



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో కూడా రాణించాలని బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పీ. వివేకానంద ఆకాంక్షించారు. సుభాష్‌నగర్‌డివిజన్ పరిధిలోని లిటిల్ స్టార్ హై స్కూల్ వార్షికోత్సవ వేడుకలకు బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించిన ఎమ్మెల్యే వారి ప్రతిభను ప్రశంసించారు. నాణ్యమైన విద్యే సమాజాభివృద్ధికి పునాది అని పేర్కొంటూ, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషిని ఎమ్మెల్యే అభినందించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నె రాజు, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, బలరాం రెడ్డి, గుబ్బాల లక్ష్మినారాయణ, ఇస్మాయిల్, నదీమ్ రాయి, పాఠశాల యాజమాన్యం అల్తాఫ్ హుస్సేన్, ఒసామా హుస్సేన్ , ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు పాల్గొన్నారు.



# ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడం కలకలం సృష్టించింది. పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతా నుంచి మేఘాలయాలోని షిల్లాంగ్ బయలుదేరాల్సిన విమానానికి బాంబు బెదిరింపులు వచ్చాయి. అప్రమత్తమైన సిబ్బంది ప్రయాణికులను కిందకు దింపేశారు. ప్రస్తుతం భద్రతా పరమైన తనిఖీలు కొనసాగుతున్నాయి. కోల్‌కతా విమానాశ్రయం నుంచి ఇండిగో విమానం ఉదయం 9:15 గంటలకు షిల్లాంగ్ బయలుదేరేందుకు సిద్ధంగా ఉంది. బోర్డింగ్ సమయంలో విమాన సిబ్బంది టాయిలెట్ కంపార్ట్‌మెంట్‌లో ఓ టిష్యూ పేపర్‌ను గుర్తించారు. దానిపై విమానంలో బాంబు అమర్చినట్లు బెదిరింపు నోట్ రాసి ఉంది. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ప్రయాణికులను కిందకు దింపేశారు. విమానాశ్రయ అధికారులకు సమాచారం అందించగా.. విమానాన్ని ఐసోలేషన్ బే ఏరియాకు తరలించారు. ప్రస్తుతం సంబంధిత అధికారులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఈ ఘటనపై ఇండిగో ప్రతినిధి స్పందించారు. దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.

# స్వర్ణాంధ్రకు దిక్సూచి ఈ బడ్జెట్

* **ప్రజల ఆశల ప్రతిబింబం: ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్ రాష్ట్ర పునర్నిర్మాణానికి పక్కా ప్రణాళిక అని నందిగామ శాసనసభ్యురాలు శ్రీమతి తంగిరాల సౌమ్య కొనియాడారు. శనివారం అసెంబ్లీలో ఆర్థిక మంత్రి శ్రీ పయ్యావుల కేశవ్ గారు ప్రవేశపెట్టిన ₹3,32,205 కోట్ల భారీ బడ్జెట్‌పై ఆమె హర్షం వ్యక్తం చేస్తూ ప్రకటన విడుదల చేశారు.

**చీకటి నుంచి వెలుగులోకి**

గత ప్రభుత్వం మిగిల్చిన ₹9.74 లక్షల కోట్ల అప్పుల భారాన్ని అధిగమించి, కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపింది. ఇది కేవలం పద్దుల ప్రకటన కాదు... "అగాధం నుంచి ఆకాశం వైపు రాష్ట్రం వేస్తున్న ధైర్యవంతమైన ముందడుగు" అని ఆమె పేర్కొన్నారు. ఆర్థిక మంత్రి వరుసగా మూడోసారి బడ్జెట్ ప్రవేశపెట్టడం ఆయన సమర్థతకు నిదర్శనమని ఆమె



అభినందించారు.

* **బడ్జెట్ ముఖ్యాంశాలు విశ్లేషణ...**
* మహిళా సాధికారత: 'తల్లికి వందనం' పథకానికి ₹9,668 కోట్ల కేటాయించడం ద్వారా రాష్ట్రంలోని ప్రతి తల్లికి ప్రభుత్వం అండగా నిలిచింది.
* రైతు సంక్షేమం: 'అన్నదాత సుఖీభవ'కు ₹6,600 కోట్లు కేటాయించడం రైతు పక్షపాతి ప్రభుత్వాన్ని ప్రతిబింబిస్తోంది.
* సామాజిక న్యాయం: బీసీ సంక్షేమానికి ₹23,650 కోట్లు, సామాజిక సంక్షేమానికి ₹11,118 కోట్లు కేటాయించడం ద్వారా అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టమైంది.
* అభివృద్ధి వికేంద్రీకరణ: అమరావతికి ₹6,000 కోట్లు, విశాఖ ఆర్థిక ప్రాంతానికి ₹28,000 కోట్లు, రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు ₹30,000 కోట్లు కేటాయించడం రాష్ట్ర ప్రాంతీయ సమతుల్యతకు నిదర్శనం.
* యువతకు ఊతం: పాఠశాల విద్యకు ₹32,308 కోట్లు, స్కిల్ డెవలప్‌మెంట్‌కు ₹1,232 కోట్లు కేటాయించడం యువత భవిష్యత్తుకు బలమైన పునాది.

ఇలా ప్రతి రంగానికి తగిన విధంగా నిధులు కేటాయించబడ్డ ఈ బడ్జెట్ కు, విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్న ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారికి, ఉపముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారికి, యువనేత శ్రీ లోకేష్ గారికి మరియు ఆర్థిక మంత్రి శ్రీ పయ్యావుల కేశవ్ గారికి ప్రత్యేకంగా నందిగామ ప్రజల తరపున ఎమ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య ధన్యవాదాలు తెలిపారు.

# 'ఎన్సీపీ'ల విలీనం లేనట్లే! – సంజయ్ రౌత్

వచ్చే రాజ్యసభ ఎన్నికల్లో ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ పోటీ చేసే యోచనలో ఉన్నట్లు శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ వెల్లడించారు. ఈ అంశంపై మహారాష్ట్రలో విపక్ష కూటమి మహావికాస్ అఘాడీ చర్చలు జరుపుతోందన్నారు. దివంగత డిప్యూటీ సీఎం అజిత్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ, శరద్ పవార్ సారథ్యంలోని ఎన్సీపీ (ఎస్పీ)లు విలీనమయ్యే అవకాశాలు దాదాపుగా లేనట్లేనని అన్నారు. దేశంలో అత్యంత సీనియర్ నాయకుల్లో ఒకరైన శరద్ పవార్ దాదాపు 60ఏళ్లకుపైగా చట్టసభలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారని రౌత్ పేర్కొన్నారు. వచ్చే రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేస్తానని



పవార్ చెప్పారని, దీనిపై కూటమిలోని మూడు పార్టీలు నిర్ణయం తీసుకుంటాయన్నారు. వచ్చే ఏప్రిల్‌లో పవార్ సహా మరో ఏడుగురు రాజ్యసభ నుంచి పదవీ విరమణ కానున్నారు. అయితే, ఇటీవల మహా వికాస్ అఘాడీ బలం తగ్గడంతో.. ఈసారి ఒకరిని మాత్రమే రాజ్యసభకు పంపే అవకాశం ఉంది. ఛాతీ నొప్పితో ఇటీవల పుణెలోని ఓ ఆసుపత్రిలో చేరిన శరద్ పవార్ ఆరోగ్యం ప్రస్తుతం కుదుటపడింది. దీంతో శనివారం మధ్యాహ్నం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయినట్లు ఆయన కుమార్తె సుప్రియా సూలే వెల్లడించారు. మూడు, నాలుగు రోజులపాటు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించినట్లు చెప్పారు.

# బంగ్లాదేశ్ ప్రధానిగా తారిఖ్ రెహమాన్ ప్రమాణస్వీకారం.. మోదీకి ఆహ్వానం..!

బంగ్లాదేశ్‌లో విజయం సాధించిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ.. ప్రభుత్వ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. మాజీ ప్రధాని ఖాలిదా జియా కుమారుడు, బీఎన్‌పీ ఛైర్మన్ తారిఖ్ రెహమాన్ దేశ నూతన ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. ఈ కార్యక్రమానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ సహా పలు దేశాల నేతలను ఆహ్వానించాలని ఆ పార్టీ యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దక్షిణాసియా దేశాలపై ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఒకవేళ మోదీ హాజరైతే..



భారత్‌బంగ్లా సంబంధాల్లో ఇదొక కీలకమైన పరిణామంగా మారనుంది. 2024 ఆగస్టులో జరిగిన విద్యార్థుల ఉద్యమంలో హసీనా ప్రభుత్వం కుప్పకూలిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి మహమ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక సలహా మండలి బంగ్లా పాలనను పర్యవేక్షిస్తూ వచ్చింది. ఆ సమయంలో రెండు దేశాలు దౌత్యపరమైన ఒడుదొడుకులను ఎదుర్కొన్నాయి. ఇదిలా ఉంటే.. బీఎన్‌పీ విజయంపై ఇప్పటికే భారత్ నుంచి సందేశం వెళ్లింది. రెహమాన్‌కు మోదీ ఫోన్ చేసి అభినందించారు. ఆయన నాయకత్వంపై ప్రజల విశ్వాసానికి ఈ ఎన్నికలు నిదర్శనమని పేర్కొన్నారు. దీనిపై మోదీకి బీఎన్‌పీ ధన్యవాదాలు తెలిపింది.

# అవాస్తవాలను ప్రచారం చేయడమే రాహుల్ సిద్ధాంతం

అవాస్తవాలను ప్రచారం చేయడమే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సిద్ధాంతమని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆరోపించారు. అమెరికాతో కుదుర్చుకున్న ట్రేడ్ డీల్‌పై తప్పుడు ఆరోపణలు చేయడాన్ని ఖండించారు. ఈ డీల్‌తో భారత మత్స్యకారులకు, రైతులకు ఎంతో మేలు జరుగుతుందని షా స్పష్టం చేశారు. పుదుచ్చేరి పర్యటనలో భాగంగా ఆయన రాహుల్ తీరును తప్పుబట్టారు. "రోజువారీ అబద్ధాలతో రాహుల్ కొత్త సంప్రదాయాన్ని తీసుకొస్తున్నారు. అవాస్తవాలు ప్రచారం చేయడమే ఆయన సిద్ధాంతం.



వాటినే పదే పదే చెబుతున్నారు. ఆయన అబద్ధాలను ప్రజలు పట్టించుకోరు. ట్రేడ్ డీల్‌పై ఆరోపణలు చేస్తూ మత్స్యకారులను, రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారు. రైతుల ప్రయోజనాల కోసమే ప్రధాని మోదీ అమెరికాతో ఒప్పందం కుదుర్చుకున్నారు.ఐరోపా, కెనడాలతోనూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరిపారు. ఈ ఒప్పందాలతో దేశంలోని మత్స్యకారులకు, రైతులకు, పశుపోషకులకు అపారమైన అవకాశాలు లభిస్తాయి. గత యూపీఏ హయాంలో రైతుల ప్రయోజనాలను తాకట్టు పెట్టేశారు." అని అమిత్ షా వ్యాఖ్యానించారు.

# ఈశాన్యంలో హైవేపై 'రన్‌వే'.. ఎందుకంత కీలకం?

ఈశాన్య భారతంలోని అస్సాంలో ఏర్పాటు చేసిన తొలి ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీపై ప్రధాని మోదీ విమానం ల్యాండ్ అయిన విషయం తెలిసిందే. దిబ్రూగఢ్‌మోరాన్ జాతీయ రహదారిపై ఉన్న రన్‌వే.. భారత్‌చైనా సరిహద్దుకు దగ్గరగా ఉండటంతో కీలక, వ్యూహాత్మక ప్రదేశంగా మారింది. అత్యవసర పరిస్థితుల్లో పౌర, సైనిక విమానాల రాకపోకలు సాగించేందుకు వీలుగా ఈ రన్‌వేను నిర్మించారు. అస్సాంలోని చబువా వైమానిక స్థావరానికి సమీపంలో ఉన్న ఈ రన్‌వే.. చైనా సరిహద్దుకు దాదాపు 300 కి.మీ దూరంలో, మయన్మార్‌కు 200 కి.మీ దూరంలోనే ఉంటుంది. అందుకే వ్యూహాత్మకంగా ఎంతో కీలకంగా మారింది. ఈ 4.2 కి.మీ ఈఎల్‌ఎఫ్ నిర్మాణానికి దాదాపు రూ.100 కోట్లు ఖర్చు చేశారు. సైనిక సంసిద్ధత, విపత్తు సమయాల్లో రెస్క్యూ ఆపరేషన్లతోపాటు అత్యవసర పరిస్థితుల్లో వేగంగా బలగాలను మోహరించేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఇలాంటి రన్‌వేను అందుబాటులోకి తేవడం ఇదే తొలిసారి. చైనాకు చెక్ పెట్టేలా.. సరిహద్దుకు అవతలివైపు చైనా అనేక నిర్మాణాలు చేపడుతోందని నివేదికలు వస్తున్నాయి. ముఖ్యంగా టిబెట్‌లో సరిహద్దుకు సమీపంలో అనేక కట్టడాలు, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసుకుంటోందని తెలుస్తోంది. దీంతో అవసరమైన సమయాల్లో చైనా తమ సైన్యాన్ని వేగంగా సరిహద్దులకు తరలించే అవకాశం ఉంది. ఈ పరిణామం భారత్‌కు సవాల్ అని చెప్పవచ్చు. అందుకే ఈశాన్య రాష్ట్రాలపై దృష్టిపెట్టిన భారత ప్రభుత్వం.. అక్కడ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తోంది.

**యుద్ధం వంటి సందర్భాల్లో..**

వాస్తవాధీన రేఖ వెంట భారత వాయుసేనకు అనేక ఎయిర్‌బేస్‌లు ఉన్నప్పటికీ.. ఇతర బేస్‌లను సిద్ధం చేసుకుంటోంది. యుద్ధం వంటి సందర్భాల్లో వైమానిక స్థావరాలే లక్ష్యంగా దాడులు జరగవచ్చు. లేదంటే అక్కడ రద్దీ వాతావరణం ఏర్పడవచ్చు. అటువంటి క్లిష్ట సందర్భాల్లో ప్రత్యామ్నాయంగా జాతీయ రహదారులపై ఏర్పాటు చేసే రన్‌వేలను ఉపయోగించుకునేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. తద్వారా



సైన్యంతోపాటు యుద్ధ సామగ్రిని వేగంగా తరలించడానికి వీలు కలుగుతుంది. అన్ని రకాల యుద్ధ విమానాల ల్యాండింగ్, టేకాఫ్‌లకు అనుగుణంగా నిర్మించిన అస్సాం రన్‌వేపై.. రఫేల్, సుఖోయ్, సీ 17 గ్లోబ్‌మాస్టర్ వంటి యుద్ధ విమానాలు ట్రయల్‌రన్స్ నిర్వహించాయి.




# శ్రీశైలంలో పాగాలంకరణ ఏర్పాట్లను పరిశీలించిన కర్నూలు రేంజ్ డిఐజి మరియు జిల్లా ఎస్పీ

* **ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలి....**
* **కర్నూలు రేంజ్ డీఐజీ శ్రీ కోయ ప్రవీణ్ IPS గారు.....**

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల మహా పుణ్యక్షేత్రంలో శివరాత్రి రోజు నిర్వహించనున్న పాగాలంకరణ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను కర్నూలు రేంజ్ డీఐజీ శ్రీ కోయ ప్రవీణ్ IPS గారు మరియు జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షొరాణ్ IPS గారు ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డీఐజీ గారు మాట్లాడుతూ పాగా అలంకరణ దర్శనం కోసం ఆహ్లాదకర వాతావరణం ఉండేలా ఏర్పాట్లు చెయ్యాలని,భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలి.

* **క్యూ లైన్లను, భక్తుల రాకపోకల మార్గాలలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చెయ్యాలి.**

ఒక పద్ధతి ప్రకారం గుడి పరిసరాలలో భక్తులు ఉంటూ స్వామి అమ్మవార్ల దర్శనంతో పాటు పాగా అలంకరణ విక్షించేలా చర్యలు తీసుకోవాలి. దర్శనార్థం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సక్రమమైన మార్గదర్శకాలు, తాగునీటి సౌకర్యం, వైద్య సహాయం వంటి మౌలిక సదుపాయాలు



అందుబాటులో ఉంచాలి. ప్రత్యేకంగా పాగాలంకరణ సమయంలో భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లు, భద్రతా మరియు బందోబస్తు తదితర అంశాలపై సమన్వయంతో విధులు నిర్వహించాలి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు సిబ్బందిని నియమించి, నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ అవసరమైన చోట అధికారులకు సూచనలు ఇవ్వాలి. భక్తులు సంయమనం పాటిస్తూ అధికారుల సూచనలతో పాగా అలంకరణను వీక్షించాలని అనుసరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు రేంజ్ డీఐజీ గారితో పాటు జిల్లా ఎస్పీ గారు, సంబంధిత పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# పాక్ సరిహద్దుల్లో రూ.40 కోట్ల డ్రగ్స్.. డ్రోన్‌తో జారవిడిచినట్లు అనుమానాలు

జమ్మూకశ్మీర్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి భారీగా మాదక ద్రవ్యాలు లభించడం కలకలం సృష్టిస్తోంది. పాకిస్థాన్ నుంచి వచ్చిన డ్రోన్ వీటిని జారవిడిచినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఆర్ఎస్ పురా సెక్టార్‌లో 6.5 కిలోలకు పైగా హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం అర్ధరాత్రి అనుమానిత డ్రోన్ కదలికలను స్థానికులు గుర్తించారు. ఆ డ్రోన్ ఏదో పదార్థాన్ని జారవిడిచినట్లు గుర్తించి.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు, బీఎస్ఎఫ్



దళాలతో కలిసి ఆ ప్రాంతంలో తనిఖీలు చేశారు. స్థానిక పొలాల్లో పెద్దఎత్తున హెరాయిన్‌ను గుర్తించారు. దాని మొత్తం విలువ రూ.40 కోట్లకు పైగా ఉంటుందని భావిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఇదిలా ఉండగా.. కథువా జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో డ్రోన్‌ల ద్వారా పాక్ నుంచి హెరాయిన్‌ను అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలపై ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిని పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌కు చెందిన జతిన్, కథువాలోని జఖ్‌బార్‌కు చెందిన డానిష్ డోగ్రాలుగా గుర్తించారు. వీరికి పాకిస్థాన్‌కు చెందిన స్మగ్లర్‌లతో సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది.

# 'సర్' ప్రక్రియ అంటూ పిలిచి.. ప్రియురాలి భర్త హత్య

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో పిలిచి ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన ఘటన పశ్చిమ బెంగాల్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బెంగాల్‌లోని నార్త్ 24 పరగణాల జిల్లాకు చెందిన బూత్ స్థాయి అధికారి రిజ్వాన్ హసన్ మండల్‌కు స్థానిక మహిళతో వివాహేతర సంబంధం ఉంది. వారి బంధానికి మహిళ భర్త నాసిర్ అలీ అడ్డొస్తున్నాడని అతడిని చంపడానికి రిజ్వాన్ పథకం వేశాడు. ప్రణాళిక ప్రకారం బెంగాల్‌లో కొనసాగుతోన్న సర్ ప్రక్రియకు సంబంధించిన కొన్ని విషయాలను చర్చించాలనే నెపంతో రిజ్వాన్ సోమవారం సాయంత్రం నాసిర్ అలీని ఓ నిర్జన ప్రదేశానికి తీసుకువెళ్లాడు. అక్కడ తన స్నేహితుడు సాగర్ సహాయంతో అతడిపై దాడి చేసి, హత్య చేశాడు. ఆధారాలు దొరకకుండా ఉండేందుకు అతడి శరీరాన్ని ముక్కలుగా నరికి వేర్వేరు ప్రదేశాల్లోని కాలువల్లో పడేశాడు. సోమవారం సాయంత్రం నుంచి నాసిర్ అలీ కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు



పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా అతడి కాల్ లిస్ట్ పరిశీలించగా.. చివరగా రిజ్వాన్‌కు ఫోన్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా నాసిర్ అలీని హత్య చేసినట్లు అంగీకరించడంతో రిజ్వాన్‌ను, అతడి స్నేహితుడిని పోలీసులు అరెస్టు చేశారు.

# నరవణె పుస్తకంపై వివాదం వేళ.. 20 ఏళ్ల కూలింగ్ ఆఫ్ పీరియడ్..?

భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ ఎం.ఎం.నరవణె రచించిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకం రాజకీయంగా వివాదాస్పదమవుతోంది. ఈ నేపథ్యంలో మిలిటరీ అధికారులు సహా అత్యున్నత పదవుల్లో ఉన్న వ్యక్తులకు సంబంధించిన పుస్తకాల విషయంలో కేంద్రం కొత్త నిబంధనలు తీసుకొచ్చే యోచనలో ఉంది. ఆయా అధికారులు పదవుల నుంచి రిటైర్ అయిన తర్వాత 20 ఏళ్ల వరకు వారి పుస్తకాలు పబ్లిష్ కాకుండా తప్పనిసరిగా కూలింగ్ ఆఫ్ పీరియడ్‌ను అమలుచేసే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆంగ్ల మీడియాలో కథనాలు వచ్చాయి.



# ఇది ట్రైలర్ మాత్రమే.. అసలు సినిమా ముందుంది: బీఆర్ఎస్ పార్టీకి కవిత హెచ్చరిక

* తాము రాజకీయ పార్టీగా మారబోతున్నట్లు తెలియగానే బీఆర్ఎస్ ట్రోలింగ్ చేసిందని ఆగ్రహం
* బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికైనా తప్పులను సరిదిద్దుకోవాలని కవిత సూచన
* వడ్డేపల్లిలో ఏఐఎఫ్‌బీ, తెలంగాణ జాగృతి కలిసి విజయం సాధించిందన్న కవిత



తమ సంస్థ రాజకీయ పార్టీగా మారబోతుందని ప్రకటించగానే బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు తమను ట్రోలింగ్ చేశారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. కానీ తమను లక్ష్యంగా చేసుకున్న వారికి ఒకటే విషయం చెబుతున్నానని, ఇది కేవలం ట్రైలర్ మాత్రమేనని, అసలు సినిమా ముందుందని హెచ్చరించారు. ఇప్పుడే తొందరపడి మాట జారవద్దని, తమపై కారుకూతలు కూయవద్దని బీఆర్ఎస్ వారిని హెచ్చరించారు.ఇప్పటికైనా మీ తప్పులను సరిదిద్దుకోవాలని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు వారు ఉద్యమకారులను కూడా పట్టించుకోలేదని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ, గతంలో 90 శాతం మున్సిపాలిటీలను గెలుచుకున్న బీఆర్ఎస్ ఈసారి 16 స్థానాలకే పరిమితమైందని కవిత గుర్తు చేశారు. ప్రజల మద్దతును ఎందుకు కోల్పోయామో బీఆర్ఎస్ ఆలోచించాలని సూచించారు. ఉత్తర తెలంగాణలో బీజేపీ గెలుపు కోసం బీఆర్ఎస్ పనిచేసిందని కవిత ఆరోపించారు. ఆ రెండు పార్టీల పొత్తుకు ఇది తొలి మెట్టు అన్నారు. కాంగ్రెస్ పార్టీతో మిలాఖత్ అయిన సీపీఐకి కొత్తగూడంలో బీఆర్ఎస్ పార్టీ మద్దతివ్వడం విడ్డూరంగా ఉందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్‌పై సాంబశివరావు చేసిన ఆరోపణలను అంగీకరిస్తున్నారా అని బీఆర్ఎస్‌ను ప్రశ్నించారు. తెలంగాణలో ప్రత్యామ్నాయం లేకపోవడం వల్లే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఓటు వేశారని అన్నారు. ఆ లోటును తెలంగాణ జాగృతి భర్తీ చేస్తుందని కవిత పేర్కొన్నారు. బీజేపీ కరీంనగర్‌లో తప్ప ఎక్కడా గెలవలేదని ఎద్దేవా చేశారు. బండి సంజయ్ రూ.30 కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. తమకు 17 స్థానాలు రావడమే చాలా ఎక్కువ అన్నట్లుగా కేటీఆర్ మాట్లాడటం విచిత్రమని కవిత అన్నారు. గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిబంధనలను ఉల్లంఘించారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు.

**వడ్డేపల్లి మున్సిపాలిటీ విజయంపై కవిత**

జాగృతి రాజకీయ పార్టీగా మారబోతుందని ప్రకటించిన తర్వాత తమ పార్టీకి చెందిన నాయకులు మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారని అన్నారు. తక్కువ సమయంలోనే ప్రజలు తమను ఆదరించారని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ జాగృతి, ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్ కలిసి పోటీ చేసి అద్భుత విజయాన్ని సాధించాయని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో తాము 40 వార్డులు గెలుచుకున్నామని అన్నారు. అధికారికంగా 33 స్థానాల్లో తమ అభ్యర్థులు విజయం సాధించారని, మరో 7చోట్ల సాంకేతిక కారణాల వల్ల స్వతంత్రులుగా గెలిచారని వెల్లడించారు. ముఖ్యంగా వడ్డేపల్లి మున్సిపాలిటీలో తమకు స్పష్టమైన మెజారిటీ వచ్చిందని కవిత వెల్లడించారు. తమ విజయంలో తెలంగాణ జాగృతి ప్రమేయం లేదని ఏఐఎఫ్‌బీ నాయకుడు వడ్డేపల్లి శ్రీనివాసులు నిన్న ప్రకటించారు. అయితే ఈరోజు కవిత ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి అంబటి బోజిరెడ్డి, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్‌లతో కలిసి మీడియా సమావేశం నిర్వహించడం గమనార్హం. వడ్డేపల్లి మున్సిపాలిటీలో తెలంగాణ జాగృతి, ఏఐఎఫ్‌పీ కలిసి కైవసం చేసుకున్నాయని కవిత స్పష్టం చేశారు.

# నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లను మేమే కైవసం చేసుకుంటాం

: మహేశ్ కుమార్ గౌడ్

* కొత్తగూడెం కార్పొరేషన్ విషయంలో సరైన నిర్ణయం తీసుకుంటామన్న మహేశ్ గౌడ్
* ఈ ఎన్నికలు కవితకు సంతోషాన్ని ఇచ్చి ఉంటాయని వ్యాఖ్య
* రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభావం ఉండదన్న పీసీసీ ప్రెసిడెంట్



మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటిన సంగతి తెలిసిందే. ఎన్నికల ఫలితాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంతృప్తిని వ్యక్తం చేశారు. నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లను కూడా తామే కైవసం చేసుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కొత్తగూడెం కార్పొరేషన్ విషయంలో సరైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఈరోజు సమావేశమవుతానని... ఈ భేటీలో కార్పొరేషన్లపై చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ ఎన్నికలు కల్వకుంట్ల కవితకు సంతోషాన్ని ఇచ్చి ఉండవచ్చని మహేశ్ గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ రోజురోజుకు పతనమవుతోందని... రాబోయే రోజుల్లో ఆ పార్టీ ప్రభావం ఉండదని చెప్పారు. మతాన్ని రెచ్చగొట్టినా మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ ఏమీ సాధించలేకపోయిందని ఎద్దేవా చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు, ఈ ఎన్నికల ఫలితాలతో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో తన పట్టును మరింత పెంచుకున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# మేము అనుకున్నన్ని రాలేదు... కాంగ్రెస్ పరిస్థితి కూడా అదే: కేటీఆర్

* మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు
* 30కి పైగా మున్సిపాలిటీలు వస్తాయని అనుకున్నామన్న కేటీఆర్
* హంగ్ వచ్చిన ప్రాంతాల్లో పరిస్థితి తమకు అనుకూలంగా ఉందని వ్యాఖ్య



తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనదైన శైలిలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ 30కి పైగా మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటుందని తాము అంచనా వేశామని... కానీ తుది ఫలితాల్లో ఆ సంఖ్య కొంత మేర తగ్గిందని ఆయన తెలిపారు. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీపై కూడా ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీకి కూడా ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదని అన్నారు. హంగ్ ఫలితాలు వచ్చిన మున్సిపాలిటీల్లో పరిస్థితి తమకు అనుకూలంగా ఉందని కేటీఆర్ చెప్పారు. చైర్మన్ పీఠాలను దక్కించుకోవడంలో కీలకమైన ఎక్స్ అఫీషియో ఓట్ల విషయంలో ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులతో చర్చించామని తెలిపారు. తమ పార్టీకి ప్రజాప్రతినిధులు ఉన్న ప్రతి చోటా కచ్చితంగా పట్టు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ గాలిలో మేడలు కట్టిందని, కానీ క్షేత్ర స్థాయిలో ప్రజలు వారికి ఆశించినన్ని మున్సిపాలిటీలను ఇవ్వలేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఇదే సమయంలో ఆయన బీజేపీపై సెటైర్లు వేశారు. నిజామాబాద్, కరీంనగర్ వంటి ఒకటి రెండు ప్రాంతాల్లో మినహా ఆ పార్టీ ప్రభావం ఎక్కడా కనిపించలేదని అన్నారు.

# కుట్రలు చేస్తే... మీ అందరినీ రాజకీయ సమాధి చేస్తా: బండి

* కరీంనగర్ మేయర్ పీఠం బీజేపీదే అన్న బండి సంజయ్
* మేయర్ పీఠాన్ని దక్కించుకుంటామని కాంగ్రెస్, బీఆర్ఎస్ అంటున్నాయని మండిపాటు
* ఆ రెండు పార్టీలు ఒకటే అనే విషయం కరీంనగర్ వేదికగా బయటపడుతోందని విమర్శ



కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం మూడు పార్టీలు ఒకటేనని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. ఆ మూడు పార్టీలకు ప్రేమికుల రోజు శుభాకాంక్షలు అని వ్యంగ్యంగా అన్నారు. కరీంనగర్ లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నాయని మండిపడ్డారు. కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీకి ఎక్కువ స్థానాలు వచ్చినప్పటికీ... మేయర్ పీఠం దక్కించుకుంటామని కాంగ్రెస్, బీఆర్ఎస్ చెబుతున్నాయని... ఏ విధంగా దక్కించుకుంటాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ రెండు పార్టీలు ఒకటే అనే విషయం కరీంనగర్ వేదికగా బయటపడుతోందని చెప్పారు. కరీంనగర్ మేయర్ పీఠం తమదేనని బండి సంజయ్ అన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కుట్రలు చేస్తే... కరీంనగర్ నుంచే యుద్ధాన్ని ప్రారంభిస్తానని హెచ్చరించారు. వారందరినీ రాజకీయ సమాధి చేస్తానని సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. బీజేపీ కార్యకర్తల శక్తి, దమ్ము మీకు తెలియదు అని అన్నారు. కరీంనగర్ కార్పొరేషన్లో బీజేపీకి కేవలం 13 సీట్లే వస్తాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇంటెలిజెన్స్ విభాగం నివేదిక ఇచ్చిందని సంజయ్ తెలిపారు. అందుకే, ఈ విజయాన్ని ఇంటెలిజెన్స్‌కే అంకితమిస్తున్నామని అన్నారు. మేయర్ పదవి కోసం గుంటనక్కలన్నీ ఏకమయ్యాయని మండిపడ్డారు. బీజేపీ సింహమని, సింగిల్ గానే వస్తుందని చెప్పారు. మరోవైపు, కరీంనగర్ కార్పొరేషన్లో మొత్తం 66 డివిజన్లు ఉండగా... బీజేపీ 30 డివిజన్లలో జయకేతనం ఎగురవేసింది. కాంగ్రెస్ 14, బీఆర్ఎస్ 9 స్థానాలకే పరిమితమయ్యాయి. ఈ నెల 16న కార్పొరేటర్ల ప్రమాణస్వీకారం ఉంటుంది.

# మున్సిపల్ ఎన్నికలు.. ఎక్స్‌అఫీషియో ఓటుపై ఈసీ స్పష్టత.. ఎవరు ఎక్కడ వేయాలంటే..!

* 30కి పైగా మున్సిపాలిటీల్లో హంగ్
* ఎమ్మెల్యేలు, లోక్ సభ సభ్యులు నియోజకవర్గంలోని ఒక మున్సిపాలిటీలో ఓటు వేయాలన్న ఈసీ
* రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు ఓటు హక్కు ఉన్న ప్రాంతంలో ఓటు వేయాలన్న ఈసీ




తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో 30కి పైగా మున్సిపాలిటీల్లో ఏ పార్టీకి మెజార్టీ రాలేదు. దీంతో అధికార కాంగ్రెస్ ప్రతిపక్ష బీఆర్ఎస్ ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల మద్దతును కూడగట్టేందుకు ప్రయత్నిస్తున్నాయి. కౌన్సిలర్లను క్యాంపులకు తరలించారు. పలు మున్సిపాలిటీలలో ఎక్స్‌అఫీషియో ఓట్లు కీలకంగా మారాయి. ఈ క్రమంలో ఎక్స్‌అఫీషియో ఓటుపై రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టతనిచ్చింది. ఎమ్మెల్యేలు, లోక్ సభ సభ్యులు తమ నియోజకవర్గ పరిధిలో ఏదైనా ఒక మున్సిపాలిటీలో ఎక్స్‌అఫీషియో ఓటు వేయవచ్చునని వెల్లడించింది. రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు తమకు ఓటు ఉన్న మున్సిపాలిటీలోనే ఎక్స్‌అఫీషియో ఓటును వినియోగించుకోవచ్చని తెలిపింది. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలకు ఎక్స్‌అఫీషియో ఓటు నమోదుకు నేటి వరకు ఎన్నికల సంఘం గడువు ఇచ్చింది. తెలంగాణలోని 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగాయి. నిన్న ఫలితాలు వెలువడగా మూడు కార్పొరేషన్లు, 66 మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ, 13 మున్సిపాలిటీలను బీఆర్ఎస్, కరీంనగర్ కార్పొరేషన్‌ను బీజేపీ దక్కించుకున్నాయి. స్వతంత్రులు లేదా ఇతరులతో కలిపి నిజామాబాద్ కార్పొరేషన్‌ను కూడా బీజేపీ దక్కించుకునే అవకాశాలు ఉన్నాయి. 37 మున్సిపాలిటీల్లో హంగ్ వచ్చింది. ఏడు కార్పొరేషన్లకు మేయర్లు, డిప్యూటీ మేయర్లు, 116 మున్సిపాలిటీలకు చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్ పదవులకు ఈ నెల 16న ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఎన్నికల్లో పాల్గొనాలని కార్పొరేటర్లు, కౌన్సిలర్లతో పాటు ఎక్స్‌అఫీషియో సభ్యులు, పార్టీల అధ్యక్షులకు సమాచారం ఇవ్వాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఎన్నికల సంఘం ఆదేశించింది. హంగ్ ఉన్నచోట ఎక్స్‌అఫీషియో ఓటు కీలకం కానున్న నేపథ్యంలో ఈసీ స్పష్టతనిచ్చింది.

# బండి సంజయ్ వారియర్ అర్జునుడి పాత్రకు ఫిట్ అవుతారు: నిజామాబాద్ ఎంపీ అరవింద్


* రాష్ట్రంలో కాంగ్రెస్ బలమైన ప్రభుత్వమేమీ కాదన్న ఎంపీ
* కార్పొరేటర్లను కాంగ్రెస్ బలవంతంగా ఎత్తుకెళితే బీఆర్ఎస్‌కు పట్టిన గతే పడుతుందని హెచ్చరిక
* ముఖ్యమంత్రిని ప్రజలు ఇప్పటికే ఛీకొడుతున్నారన్న ధర్మపురి అరవింద్



బండి సంజయ్ ఒక వారియర్ అని, ఆయన అర్జునుడి పాత్రకు ఫిట్ అవుతారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. నిజామాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ బలమైన ప్రభుత్వమేమీ కాదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బలమైన స్థాయిలో ఏమీ లేరని వ్యాఖ్యానించారు. మున్సిపల్ వార్డు సభ్యులు, కార్పొరేటర్లను బలవంతంగా ఎత్తుకెళ్తే బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రజలు ఇప్పటికే ఛీకొడుతున్నారని, ఇప్పుడు కార్పొరేటర్లను ఎత్తుకెళితే మరింత ఛీకొడతారని అన్నారు. నిజామాబాద్ కార్పొరేషన్ ఫలితాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల కంటే ఎక్కువ స్థానాలు గెలుచుకున్నామని అన్నారు. తన పార్లమెంట్ పరిధిలో కూడా బీఆర్ఎస్ కంటే ఎక్కువ సీట్లను గెలుచుకున్నామని ధర్మపురి అరవింద్ వెల్లడించారు. కాంగ్రెస్ లౌకిక వాద పార్టీ కాదని, ఓ బ్రోకర్ పార్టీ అని దుయ్యబట్టారు. ప్రభుత్వం పోలీసు శాఖను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. తమ పార్టీ అభ్యర్థులను పోలింగ్ బూత్‌ల నుంచి పంపించినందుకు నేనే వారిపై కేసు పెట్టాలని ఆయన అన్నారు. కానీ పోలీసులే తనపై కేసు పెట్టారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని పోలీసులు చెప్పారని ఆరోపించారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లను ఎత్తుకెళ్లడానికి కాంగ్రెస్ పార్టీకి పోలీసులు సహకరిస్తున్నారని విమర్శించారు. రాజకీయాలను భ్రష్టు పట్టించారనే కేసీఆర్‌ను తెలంగాణ ప్రజలు ఓడించారని, ఇప్పుడు రేవంత్ రెడ్డి అదే దారిలో నడుస్తున్నారని మండిపడ్డారు. రాజకీయాల్లో హుందాతనం ముఖ్యమని అన్నారు. ఎవరికి మద్దతు ఇవ్వాలనేది కార్పొరేటర్లు నిర్ణయించుకుంటారని తెలిపారు. కానీ బలవంతంగా ఎత్తుకెళ్లడం సరికాదని అన్నారు. కరీంనగర్‌లోను బండి సంజయ్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటిందని ప్రశంసించారు.

# కేటీఆర్ ఆఫర్‌పై ఎమ్మెల్యే కూనంనేని స్పందన

* కొత్తగూడెం కార్పొరేషన్‌లో అత్యధిక స్థానాలు గెలుచుకున్న సీపీఐ
* తాము మద్దతు ఇస్తామని కేటీఆర్ స్వయంగా ఫోన్ చేసి తెలిపారన్న కూనంనేని సాంబశివరావు
* మేయర్ పదవిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోబోమని స్పష్టీకరణ



కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో కీలకంగా మారింది. ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీపీఐకి బేషరతుగా మద్దతు ప్రకటించడం రాజకీయంగా సంచలనంగా మారింది. కొత్తగూడెం కార్పొరేషన్‌లో సీపీఐ అత్యధిక స్థానాలు గెలుచుకున్న నేపథ్యంలో, తాము మద్దతు ఇస్తామని కేటీఆర్ స్వయంగా ఫోన్ చేసి తెలిపారని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. మీరు గెలిచారు కాబట్టి మీకు మద్దతు ఇస్తాం అని కేటీఆర్ చెప్పినట్లు ఆయన ధృవీకరించారు. కూనంనేని మాట్లాడుతూ.. మేయర్ పదవిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోబోమన్నారు. ఇది తమకు వచ్చిన గొప్ప అవకాశం అని పేర్కొన్నారు. ఎవరైనా మద్దతు ఇస్తే స్వాగతిస్తామని చెప్పారు. ప్రజలకు సేవ చేయడమే తమ లక్ష్యమని, మేయర్ పీఠాన్ని దక్కించుకోవడంలో రాజీ పడబోమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌తో పాటు పలువురు ఇండిపెండెంట్లు కూడా మద్దతు ఇస్తామని ముందుకు వచ్చినట్లు తెలిపారు. అయితే పొత్తుల విషయంలో ఎలా ముందుకు వెళ్లాలి అనే అంశంపై మరో రెండు రోజుల్లో పార్టీ అంతర్గత సమావేశంలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని కూనంనేని తెలిపారు.

# తెలంగాణలో రెండు చోట్ల గెలవడంపై స్పందించిన జనసేన పార్టీ

* జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ పోటీ చేస్తామన్న జనసేన
* 330కి పైగా అభ్యర్థులు తెలంగాణలో బరిలో నిలిచారన్న జనసేన
* భవిష్యత్తు ఎన్నికల్లో ఇదే ఉత్సాహంతో ముందుకు సాగుతామని వ్యాఖ్య



తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల్లో రెండు చోట్ల గెలవడం సంతోషకరమని, జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ పోటీ చేస్తామని జనసేన పార్టీ తెలంగాణ విభాగం ప్రకటించింది. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల ఫలితాల్లో జనసేన ఉనికిని చాటుకున్న విషయం తెలిసిందే. ఆ పార్టీ రెండు చోట్ల విజయం సాధించింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొంగునూరి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికలలో 330 పైగా అభ్యర్థులు పోటీలో నిలిచారని తెలిపారు. మంచిర్యాల్ కార్పొరేషన్‌లో 34వ డివిజన్ నుండి జనసేన కార్పొరేటర్ అభ్యర్థి అగ్గు సాగర్ 31 ఓట్ల మెజార్టీతో, సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపాలిటీలో 14వ వార్డు నుండి 29 ఓట్ల మెజారిటీతో ఆరూరి విజయలక్ష్మి నాగేశ్వరరావు విజయం సాధించారని తెలిపారు. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలలో పార్టీకి ఓటేసిన ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ ఎన్నికల కోసం పార్టీ నాయకులు, పార్టీ శ్రేణులు, వీర మహిళలు అందరూ ఎంతో కష్టపడి పనిచేశారని అన్నారు. తక్కువ సమయంలోనే పార్టీ గెలుపు కోసం ఎంతో శ్రమించిన వారందరికీ ఆయన పవన్ కల్యాణ్ తరపున, రాష్ట్ర నాయకుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ పార్టీ ఇన్‌ఛార్జ్ నేమూరి శంకర్ గౌడ్ మాట్లాడుతూ, రెండు చోట్ల గెలవడం సంతోషకరమని అన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లోనూ పోటీ చేస్తామని తెలిపారు. తెలంగాణ ఉద్యమం స్ఫూర్తితో పవన్ కల్యాణ్ పార్టీని స్థాపించారని పార్టీ రాష్ట్ర నాయకులు రాజలింగం అన్నారు. పవన్ కల్యాణ్ ఆశయాలను, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. పార్టీని మరింత బలోపేతం చేస్తామని సీనియర్ నాయకుడు ఆర్కే సాగర్ అన్నారు. తెలంగాణలో జనసేన బోణీ కొట్టిందని మరో నాయకుడు ప్రేమ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మరింత ఉత్సాహంగా పనిచేస్తామని అన్నారు.

## జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఆదాయం రూ.4,083 కోట్లు



**న్యూఢిల్లీ:** జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్, డిసెంబరు త్రైమాసికంలో ఏకీకృత ఖాతాల ప్రకారం రూ.4,082.77 కోట్ల ఆదాయంపై రూ.173.96 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాలంలో సంస్థ ఆదాయం రూ.2,748.22 కోట్లు, నికర లాభం రూ.202.10 కోట్లుగా ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 9 నెలల కాలానికి ఆదాయం రూ.11,157.85 కోట్లు, నికర లాభం రూ.71.90 కోట్లుగా ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరం మూడు త్రైమాసికాల్లో కలిపి రూ.7,859.20 కోట్ల ఆదాయం, నికర నష్టం రూ.564.24 కోట్లుగా ఉన్నాయి. నిర్వహణ పరంగా కంపెనీ పనితీరు మెరుగుపడిందని యాజమాన్యం పేర్కొంది. దిల్లీ, హైదరాబాద్ విమానాశ్రయాలకు సంబంధించి రాబోయే టారిఫ్ ఆర్డర్ల అమలుతో, భవిష్యత్తులో ఆదాయం, మార్జిన్లు మెరుగుపడతాయని కంపెనీ ఆశాభావం వ్యక్తం చేసింది.

## రిలయన్స్ చేతికి వెనెజువెలా చమురు!




**న్యూఢిల్లీ:** వెనెజువెలా నుంచి ముడిచమురును నేరుగా కొనుగోలు చేయడానికి, అమెరికా నుంచి సాధారణ లైసెన్స్‌ను ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) పొందింది. ప్రపంచంలోనే, ఒకేచోట అతిపెద్ద రిఫైనింగ్ సముదాయాన్ని గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో కంపెనీ నిర్వహిస్తున్న ఆర్ఐఎల్, ఇందుకోసం భారీఎత్తున చమురు దిగుమతి చేసుకుంటూ ఉంటుంది. పాశ్చాత్య దేశాల ఆంక్షల నేపథ్యంలో, రష్యా నుంచి చమురు దిగుమతులను సంస్థ నిలిపేసిన సంగతి విదితమే. వెనెజువెలా నుంచి చమురు దిగుమతులు ప్రారంభమైతే, రిలయన్స్ రిఫైనింగ్ మార్జిన్లూ బలోపేతం కానున్నాయి. గత నెలలో వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను నిర్బంధంలోకి తీసుకున్న అమెరికా, ఆ దేశ ముడిచమురు పరిశ్రమపై ఆంక్షలను సడలించింది. ఇప్పటివరకు ట్రేడర్ల ద్వారా వెనెజువెలా చమురును విక్రయించడానికి అమెరికా అనుమతి ఇచ్చింది. ఇప్పుడు ఆర్ఐఎల్‌కు లభించిన సాధారణ లైసెన్స్ వల్ల, ఏదైనా సంస్థ వెలికితీసిన లేదా ఆధీనంలో ఉన్న చమురును నేరుగా కొనుగోలు చేసే అధికారం లభిస్తుంది.

**ఆరేళ్లుగా ఆంక్షల చట్రంలో..**

వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో పాలనపై 2019-20లో అమెరికా ఆంక్షలు విధించింది. అప్పటివరకు వెనెజువెలా ముడిచమురును ఆర్ఐఎల్ కొనుగోలు చేసినా, అంతటితో ఆపేసింది. 2024లో తాత్కాలిక ఉపశమనం ఇవ్వడంతో, మళ్లీ చమురును కొనుగోలు చేసింది. ఈ ఏడాదిలో ట్రేడర్ల ద్వారా వెనెజువెలా విక్రయాలు ప్రారంభమయ్యాక.. అంతర్జాతీయ ట్రేడింగ్ సంస్థ విటోల్ నుంచి 2 మిలియన్ బ్యారెళ్లు కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకుంది. ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రభుత్వ రంగ సంస్థలు ఐఓసీ, హెచ్‌పీసీఎల్ కూడా 2 మిలియన్ బ్యారెళ్లు కొనుగోలు చేశాయి. ఇందులో 5 లక్షల బ్యారెళ్ల చమురును విశాఖపట్నంలోని యూనిట్‌కు హెచ్‌పీసీఎల్ కేటాయించిందని సమాచారం.

వెనెజువెలా ముడిచమురు గ్రేడ్‌లు, ముఖ్యంగా ఒరినోకో ప్రాంతం నుంచి వచ్చేవి సంక్లిష్టంగా, భారీగా ఉంటాయి. వీటిని సమర్థంగా ప్రాసెస్ చేసే సామర్థ్యాలు జామ్‌నగర్ రిఫైనరీలో ఉన్నాయి. రవాణా ఇబ్బందుల కారణంగా వెనెజువెలా చమురు కొంత రాయితీ ధరలకే లభిస్తోంది. దీనిని డీజిల్, కిరోసిన్, వంటగ్యాస్ (ఎల్‌పీజీ)గా మార్చొచ్చు. రిలయన్స్ రిఫైనింగ్ మార్జిన్‌లు పెరగడానికి ఇది దోహదం చేయనుంది.

## లీడ్ బ్యాంక్ పథకానికి కొత్త రూపు

**నిబంధనల సవరణకు ఆర్‌బీఐ ప్రతిపాదనలు**




**ముంబై:** జిల్లా స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయం చేసేందుకు 1969లో ప్రవేశపెట్టిన లీడ్ బ్యాంక్ పథకం (ఎల్‌బీఎస్)లో మార్పులు చేయాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. ఇందుకోసం కొన్ని నిబంధనలను సవరిస్తూ, శుక్రవారం ముసాయిదాను విడుదల చేసింది. బ్యాంకులు, ప్రభుత్వ విభాగాలు, ఇతర అభివృద్ధి సంస్థలను సమన్వయం చేస్తూ, ప్రాధాన్య రంగాలకు రుణ మంజూరును పెంచడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. తాజా ప్రతిపాదనల ప్రకారం.. పథకం లక్ష్యాలు, నిర్మాణం, సభ్యత్వం, వివిధ వేదికల అజెండా, కీలక అధికారుల బాధ్యతలు, రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ), లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కార్యాలయాలను బలోపేతం చేయడం వంటి అంశాలపై దృష్టి సారించనున్నారు. ప్రతి జిల్లాలోనూ ఒక వాణిజ్య బ్యాంకును లీడ్ బ్యాంక్‌గా ఆర్‌బీఐ నియమిస్తుంది. రాష్ట్రంలోని అన్ని బ్యాంకుల కార్యకలాపాలను ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ బ్యాంకులు సమన్వయం చేస్తాయి. రుణాల మంజూరులో ఎదురయ్యే సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో చర్చిస్తూ, బ్యాంకులకు అవసరమైన సహకారాన్ని అందిస్తాయి. ముఖ్యంగా రోడ్లు, డిజిటల్ కనెక్టివిటీ, శాంతిభద్రతలు, నిరంతర విద్యుత్ సరఫరా వంటి మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వంతో సంప్రదింపులు నిర్వహిస్తూ, ప్రతి ప్రాంతానికి బ్యాంకింగ్ సేవలు అందేలా చూడాలి. రుణ ప్రణాళికల రూపకల్పనలో క్షేత్రస్థాయి నుంచి పరిశీలించాలని ముసాయిదాలో పేర్కొన్నారు.

## కొలంబోలో భారత్-పాక్

# 'బిగ్ ఫైట్'

**మ్యాచ్‌కు వర్షం గండం**

**బంగాళాఖాతంలో అల్పపీడనంపై శ్రీలంక వాతావరణ శాఖ హెచ్చరిక**

**టోర్నీలో ఇప్పటివరకు ఓటమి ఎరుగని ఇరు జట్లు**

**మ్యాచ్ రద్దయితే ఇరు జట్లకు చెరో పాయింట్ లభించే అవకాశం**

**టీ20 వరల్డ్ కప్‌లలో పాక్‌పై భారత్‌దే ఆధిక్యం**




**కొలంబో:** టీ20 ప్రపంచకప్‌లో భాగంగా నేడు చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ మధ్య జరగనున్న హైవోల్టేజ్ మ్యాచ్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. కొలంబోలోని ఆర్.ప్రేమదాస స్టేడియం వేదికగా జరగనున్న ఈ పోరుకు వర్షం ముప్పు పొంచి ఉందని వాతావరణ నివేదికలు సూచిస్తున్నాయి. దీంతో ఈ బిగ్ మ్యాచ్ సజావుగా సాగుతుందా? లేదా? అని అభిమానులు ఆందోళన చెందుతున్నారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని శ్రీలంక వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో ఈ ఆందోళనలు మొదలయ్యాయి. "15వ తేదీన ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది" అని వాతావరణ శాఖ తన ప్రకటనలో పేర్కొంది. ఈ అల్పపీడన ప్రభావంతో కొలంబోలో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలుస్తోంది.

మరోవైపు, ప్రముఖ వాతావరణ సంస్థ అక్యూవెదర్ నివేదిక ప్రకారం.. మ్యాచ్ ప్రారంభానికి రెండు గంటల ముందు సాయంత్రం 5 గంటలకు జల్లులు పడే అవకాశం ఉంది. అయితే, మ్యాచ్ సమయంలో వర్షం పడే సూచనలు తక్కువేనని తెలిపింది. ఆట జరిగేటప్పుడు వాతావరణం మేఘావృతమై, ఉష్ణోగ్రత 27 డిగ్రీల సెల్సియస్‌గా ఉంటుందని అంచనా.

ఈ టోర్నీలో ఇప్పటివరకు భారత్, పాకిస్థాన్ జట్లు ఓటమి లేకుండా దూసుకెళ్తున్నాయి. సూపర్-8 దశకు అర్హత సాధించాలంటే ఈ మ్యాచ్‌లో విజయం ఇరు జట్లకు అత్యంత కీలకం. అమెరికా, నమీబియాలపై గెలిచి భారత్ మంచి ఫామ్‌లో ఉండగా.. నెదర్లాండ్స్, అమెరికాలపై విజయాలతో పాకిస్థాన్ కూడా బలంగా కనిపిస్తోంది. ఇప్పటివరకు టీ20 ప్రపంచకప్‌లలో ఇరు జట్లు 8 సార్లు తలపడగా, భారత్ 7-1 ఆధిక్యంలో ఉంది. ఒకవేళ వర్షం కారణంగా మ్యాచ్ రద్దయితే, ఇరు జట్లకు చెరొక పాయింట్ లభిస్తుంది.

## ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ టీం మెంబర్‌కు గుండెపోటు..

**ఢిల్లీలో అత్యవసర చికిత్స**



**న్యూఢిల్లీ:** టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా ఇండియాలో పర్యటిస్తున్న ఆఫ్ఘనిస్తాన్ టీంకు ఆందోళన కలిగించే సంఘటన జరిగింది. ఆ టీంలోని ఒక సభ్యుడికి గుండెపోటు వచ్చినట్లు సమాచారం. దీంతో అతడిని ఢిల్లీలోని ఆస్పత్రికి తరలించి, అత్యవసర చికిత్స అందించినట్లు టీం సభ్యులు తెలిపారు. టీ20 వరల్డ్ కప్‌లో పాల్గొంటున్న ఆఫ్ఘన్ టీం ప్రస్తుతం ఢిల్లీలో ఉంది.

ఆఫ్ఘనిస్తాన్ టీం పర్ఫామెన్స్ అనలిస్ట్‌గా పనిచేస్తున్న కేసీ రామ సుబ్రమణియన్, హోటల్‌లో ఉన్న సమయంలో గుండెపోటుకు గురయ్యాడు. అక్కడ జట్టు మెడికల్ టీం మొదట అతడికి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం అతడిని టీం సభ్యులు దక్షిణ ఢిల్లీలోని ఫోర్టిస్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆయనకు వైద్యులు యాంజియోప్లాస్టీ చేసినట్లు సన్నిహితులు తెలిపారు. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, అయినప్పటికీ ఐసీయూలో అబ్జర్వేషన్‌లో ఉంచారని వెల్లడించారు. రామ సుబ్రమణియన్ అనారోగ్యం పాలవడంతో ఆఫ్ఘనిస్తాన్ టీం సభ్యుల్లో కెప్టెన్ రషీద్ ఖాన్, సీనియర్ ఆటగాడు మొహమ్మద్ నబీ వంటి ఆటగాళ్లు ఆస్పత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు.

రామ సుబ్రమణియన్ అనారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అతడి కుటుంబానికి ప్రైవసీ కల్పించాలని ఆఫ్ఘన్ క్రికెట్ బోర్డ్ కోరింది. ఇక.. అతడికి అవసరమైన వైద్య సహాయం అందిస్తామని ఇటు బీసీసీఐ, అటు ఐసీసీ కూడా ప్రకటించాయి. ఈ సంస్థల తరఫున ఆస్పత్రికి ప్రతినిధిని పంపి, పరిస్థితిని సమీక్షించారు.

## టీ20 వరల్డ్ కప్.. ఐర్లాండ్ పరుగుల సునామీ...

**ఛేజింగ్‌లో చేతులెత్తేసిన ఒమన్**

**టీ20 ప్రపంచకప్‌లో ఒమన్‌పై ఐర్లాండ్ 96 పరుగుల తేడాతో ఘనవిజయం**

**కెప్టెన్ లోర్కాన్ టక్కర్ 51 బంతుల్లో 94 పరుగులతో వీరవిహారం**

**తొలుత బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ 20 ఓవర్లలో 235 పరుగుల భారీ స్కోరు**

**లక్ష్య ఛేదనలో ఒమన్ 18 ఓవర్లలో 139 పరుగులకే ఆలౌట్**

**ఐర్లాండ్ బౌలర్ జాషువా లిటిల్‌కు 3 వికెట్లు**




**కొలంబో:** టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఐర్లాండ్ జట్టు 96 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. కొలంబోలోని సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఐర్లాండ్ బ్యాటర్లు పరుగుల సునామీ సృష్టించారు. తొలుత బ్యాటింగ్ చేసి భారీ స్కోరు సాధించగా, అనంతరం బౌలర్లు కూడా రాణించడంతో ఒమన్ చిత్తయింది.

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఒమన్ నిర్ణయం పూర్తిగా బెడిసికొట్టింది. మొదట బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 235 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. కెప్టెన్, వికెట్ కీపర్ లోర్కాన్ టక్కర్ (51 బంతుల్లో 94 నాటౌట్; 10 ఫోర్లు, 4 సిక్సులు) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. అతనికి గారెత్ డెలానీ (30 బంతుల్లో 56; 3 ఫోర్లు, 4 సిక్సులు) అండగా నిలిచాడు. చివర్లో జార్జ్ డాక్రెల్ (9 బంతుల్లో 35 నాటౌట్; 5 సిక్సులు) విధ్వంసకర ఇన్నింగ్స్‌తో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ఒమన్ బౌలర్లలో షకీల్ అహ్మద్ మూడు వికెట్లు తీశాడు.

అనంతరం 236 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఒమన్ ఏ దశలోనూ గెలుపు దిశగా సాగలేదు. ఆమిర్ కలీమ్ (50), హమ్మద్ మీర్జా (46) కాస్త పోరాడినప్పటికీ, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. ఐర్లాండ్ బౌలర్ల ధాటికి ఒమన్ 18 ఓవర్లలో 139 పరుగులకే ఆలౌట్ అయింది. ఐర్లాండ్ బౌలర్లలో జాషువా లిటిల్ కేవలం 16 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా, బారీ మెకార్తీ, మాథ్యూ హంఫ్రీస్ చెరో రెండు వికెట్లు తీశారు. లోర్కాన్ టక్కర్ అద్భుత ఇన్నింగ్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

# చిన్నస్వామికి కొత్త కళ..

**భారత దిగ్గజాల పేర్లతో స్టాండ్లు.. !**



**బెంగళూరు:** చిన్నస్వామి మైదానం కొత్త కళ సంతరించుకోనుంది. క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంతో కర్నాటక క్రికెట్ సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. భారత, కర్నాటక క్రికెట్‌కు విశేష సేవలందించిన దిగ్గజాలను గౌరవిస్తూ వారి పేర్లను చిన్నస్వామి స్టాండ్లకు పెట్టనుంది. మాజీ కెప్టెన్లు శాంత రంగస్వామి, అనిల్ కుంబ్లే, రాహుల్ ద్రవిడ్‌ల పేరుతో స్టాండ్లను ఏర్పాటు చేస్తామని శనివారం కేఎస్‌సీఏ తెలిపింది.

కర్నాటక క్రికెట్ సంఘం భారత లెజెండ్స్‌కు ప్రత్యేక గౌరవం కల్పించనుంది. మ్యాచ్‌ల పునరుద్ధరణకు ఆమోదం లభించడంతో మాజీ కెప్టెన్లు రాహుల్ ద్రవిడ్, అనిల్ కుంబ్లే, మహిళల జట్టు మాజీ సారథి రంగస్వామిల పేర్లతో పెవిలియన్స్ ఏర్పాటు చేయనుంది. భారతదేశం గర్వించదగ్గ స్పిన్నర్ కుంబ్లే.. టెస్టుల్లో 619, వన్డేల్లో 337 వికెట్లు పడగొట్టాడు. ఇక ద్రవిడ్.. టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన రెండో భారతీయుడిగా నిలిచాడు. సచిన్ 13,288తో అగ్రస్థానంలో ఉండగా.. ద్రవిడ్ 10,889 రన్స్ చేశాడు.

రంగస్వామి విషయానికొస్తే.. భారత మహిళల జట్టుకు మొట్టమొదటి కెప్టెన్ తను. ఆమె హయాంలోనే టీమిండియా తొలి టెస్టు సిరీస్ గెలిచింది. అంతేకాదు.. మహిళల క్రికెట్‌లో తొలి టెస్టు సెంచరీ కొట్టింది ఆమెనే. భారత క్రికెట్‌పై చెరగని ముద్ర వేసినందున ఈ ముగ్గురి పేర్లతో చిన్నస్వామి స్టేడియంలో స్టాండ్లు పెట్టాలని కర్నాటక క్రికెట్ సంఘం తీర్మానించింది.

**తొక్కిసలాట తర్వాత..**

ఆర్సీబీ జట్టు నిరుడు ఐపీఎల్(18వ సీజన్) విజేతగా నిలవడంతో అభిమానులు పులకించిపోయారు. విక్టరీ పరేడ్‌లో తమ అభిమాన ఆటగాళ్లను చూసేందుకు జూన్ 4వ తేదీన చిన్నస్వామి స్టేడియానికి భారీగా తరలి వచ్చారు. అయితే.. ఫ్యాన్స్ పోటెత్తడంతో అందర్నీ అదుపు చేయలేకపోయారు పోలీసులు. ఒక్కసారిగా స్టేడియం గేటు తెరవడంతో లోపలికి వెళ్లేందుకు అభిమానులు పరుగులు తీశారు. ఈ క్రమంలో తొక్కిసలాట జరిగి 11 మంది ప్రాణాలు విడిచారు. కర్నాటక క్రికెట్ సంఘం, నిర్వాహకులు నిర్లక్ష్యంతోనే తొక్కిసలాట జరిగిందని కమిషన్ తేల్చింది.

దాంతో.. అప్పటి నుంచి చిన్నస్వామిలో క్రికెట్ ఊసే లేకుండా పోయింది. క్రీడలను ప్రేమించే బెంగళూరులో మళ్లీ క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించాలని ప్రభుత్వం, కొత్తగా ఎన్నికైన కేఎస్‌సీఏ కార్యవర్గం చేసిన ప్రయత్నాలు ఫలించేలా ఉన్నాయి. ఏక సభ్య కమిషన్ నుంచి ఆమోదం లభించగా.. ఐపీఎల్, అంతర్జాతీయ మ్యాచ్‌ల నిర్వహణకు ఈమధ్యే క్యాబినెట్ కూడా ఆమోదం తెలిపింది. సో.. పంతొమ్మిదో సీజన్ మ్యాచ్‌లకు బెంగళూరు ఆదిథ్యమిచ్చే అవకాశాల్ని కొట్టిపారయలేం.

MOVIE TIME

# రాజాసాబ్ 'డూప్' వివాదం..

## ట్రోలర్లకు మాళవిక మోహనన్ అదిరిపోయే కౌంటర్!



టాకీస్: ప్రభాస్ కథానాయకుడిగా మారుతి దర్శకత్వంలో రూపొందిన 'ది రాజాసాబ్' చిత్రంపై వస్తున్న ట్రోల్స్‌కు హీరోయిన్ మాళవిక మోహనన్ గట్టి కౌంటర్ ఇచ్చారు. ఈ సినిమాలో తను చేసిన యాక్షన్ సీక్వెన్స్‌ల కోసం డూప్ వాడారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి ఆమె స్వయంగా క్లారిటీ ఇచ్చారు. సినిమా ఓటీటీలోకి వచ్చిన తర్వాత, విలన్ గ్యాంగ్‌లో నటించిన రోన్సన్ విన్సెంట్ ఒక ఫోటోను షేర్ చేయగా.. అందులో మాళవిక వేసుకున్న దుస్తుల్లోనే ఒక పురుష స్టంట్ మాన్ ఉండటంతో, ఆమె అసలు ఫైట్స్ చేయలేదంటూ నెటిజన్లు విమర్శలు మొదలు పెట్టారు. దీంతో ఈ వార్తలపై స్పందించిన మాళవిక, తాను స్వయంగా రోప్ సాయంతో స్టంట్స్ చేస్తున్న బిహైండ్ ది సీన్స్ వీడియోలను తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. తనకు చిన్నప్పటి నుంచి క్రీడలంటే ఇష్టమని తెలిపిన మాళవిక, శారీరక సవాలుతో కూడిన పనులు చేయడం అలవాటు కాబట్టి తన యాక్షన్ సీన్లను తనే స్వయంగా చేశానని ఆమె స్పష్టం చేసింది. సాధారణంగా సినిమాల్లో అత్యంత ప్రమాదకరమైన షాట్స్ చేసేటప్పుడు నటీనటులకు దెబ్బలు తగలకుండా ఉండేందుకు ప్రొఫెషనల్ స్టంట్ డబుల్స్ ఉండటం సినిమా రంగంలో కామన్ అని ఆమె వివరించారు. ఈ సందర్భంగా తనకు స్టంట్స్ నేర్పించిన సదరు స్టంట్ మాన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ, అనవసరపు విమర్శలకు ఆమె తెరదించారు.

## అట్లీ-అల్లు అర్జున్ మూవీ సినిమా షూటింగ్ డిలేపై అల్లు అసహనం



టాకీస్: ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ కుమార్ తో చేస్తున్న భారీ పాన్ ఇండియా సినిమా గురించి ఇండస్ట్రీలో ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. దాదాపు రూ.800 కోట్ల భారీ బడ్జెతో హాలీవుడ్ రేంజ్‌లో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. విజువల్ వండర్‌గా, హైఎండ్ గ్రాఫిక్స్‌తో ఈ సినిమాను తీర్చిదిద్దుతున్నట్లు సమాచారం. అందుకే ఈ సినిమాకు సంబంధించిన చిన్న న్యూస్ అయినా సోషల్ మీడియాలో క్షణాల్లో వైరల్ అవుతోంది. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం, ఈ సినిమా విడుదల తర్వాత ఇండియన్ సినిమా మేకింగ్ స్టైల్‌లో కొత్త ట్రెండ్ సెట్ అవుతుందని భావిస్తున్నారు. లార్జ్ స్కేల్ ప్రాజెక్ట్స్‌కు ఈ సినిమా ఫౌండేషన్‌గా మారే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా కొనసాగుతుందనే వార్తలు వినిపిస్తున్నప్పటికీ, తాజాగా ఈ ప్రాజెక్ట్‌పై మరో టాక్ ఇండస్ట్రీలో చక్కర్లు కొడుతోంది. అదేంటంటే? సినిమా షూటింగ్ అనుకున్న దానికంటే నెమ్మదిగా సాగుతుండటంతో అల్లు అర్జున్ అసంతృప్తిగా ఉన్నాడని గాసిప్స్ వినిపిస్తున్నాయి. ఎ÷-లాన్ చేసిన రిలీజ్ డేట్‌కు సినిమా పూర్తి అవుతుందా లేదా అన్న ఆందోళన కూడా బన్నీకి ఉన్నట్లు టాక్. ఈ నేపథ్యంలో మేకర్స్‌తో మాట్లాడి, మేకింగ్‌ను మరింత పక్కాగా ప్లాన్ చేసి షూటింగ్ వేగవంతం చేయాలని సూచించినట్టు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ న్యూస్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఇక ఈ సినిమా తర్వాత అల్లు అర్జున్ మరో తమిళ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ తో కూడా సినిమా చేయనున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఆ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన రావడంతో ఫ్యాన్స్‌లో మరింత ఎగ్జైట్మెంట్ పెరిగింది. ఆ సినిమా కూడా భారీ పాన్ ఇండియా లెవల్‌లో తెరకెక్కనుందని టాక్ వినిపిస్తోంది. మొత్తంగా చూస్తే, అట్లీ - అల్లు అర్జున్ కాంబినేషన్ మూవీ 2027లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఈ రెండు ప్రాజెక్ట్స్ పూర్తయ్యే సరికి అల్లు అర్జున్ రేంజ్ గ్లోబల్ లెవల్‌కు వెళ్లే అవకాశం ఉందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఫ్యాన్స్ మాత్రం ఈ భారీ సినిమాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## రోషన్ హీరోగా ఏమో ఏమో ఇది మూవీ

టాకీస్: ఛాంపియన్ హీరో రోషన్ మేక టాలెంటెడ్ డైరెక్టర్ శైలేష్ కొలను కాంబినేషన్‌లో రూపొందుతున్న సరికొత్త చిత్రానికి 'ఏమో ఏమో ఇది' అనే క్లాసిక్ టైటిల్‌ను ఖరారు చేశారు మేకర్స్. వాలెంటైన్స్ డే సందర్భంగా శనివారం ఈ సినిమా టైటిల్‌తో పాటు 'ద ఫస్ట్ బ్రీజ్' పేరుతో ఒక చిన్న గ్లింప్స్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది.




ఇప్పటివరకు 'హిట్' సిరీస్, 'సైంధవ్' వంటి ఇంటెన్స్ క్రైమ్ థ్రిల్లర్లతో మెప్పించిన శైలేష్ కొలను, ఈసారి పూర్తి భిన్నంగా రొమాంటిక్ కామెడీ జానర్‌ను ఎంచుకోవడం విశేషం. ఈ గ్లింప్స్‌లో హీరో రోషన్ (అభయ్) తన తల్లితో అమ్మాయిల గురించి, నేటి తరం రిలేషన్ షిప్స్ గురించి చేసే కామెడీ సంభాషణలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ సినిమాలో రోషన్ సరసన 'కన్నప్ప' ఫేమ్ ప్రీతి ముకుందన్ (అపూర్వ పాత్రలో) కథానాయికగా నటిస్తోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'ఖుషి', 'హాయ్ నాన్న' వంటి చిత్రాలకు అద్భుతమైన మ్యూజిక్ అందించిన హేషామ్ అబ్దుల్ వహాబ్ ఈ సినిమాకు సంగీతం సమకూరుస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని 2026 దసరా కానుకగా థియేటర్లలోకి తీసుకురావాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు.

## ఘట్టమనేని మరో వారసుడు జయకృష్ణ ఎంట్రీ


### శ్రీనివాస మంగాపురం మూవీ పోస్టర్ విడుదల

టాకీస్: వాలంటైన్స్ డే సందర్భంగా తెలుగు సినీ ప్రియులకు ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. సూపర్ స్టార్ కృష్ణ మనవడు, రమేష్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ మరియు టైటిల్ పోస్టర్‌ను చిత్ర బృందం నేడు విడుదల చేసింది. విడుదలైన పోస్టర్‌లో 'ఏ భాషలో చెప్పాలి నా ప్రేమని, వెయ్యేళ్ళ నా ఈ ఎడబాటుని' అంటూ కథానాయకుడు శ్రీను మంగతో చెప్పిన డైలాగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఘట్టమనేని కుటుంబం నుంచి మరో వారసుడు ఈ సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెడుతుండడంతో మూవీపై భారీ



అంచనాలు నెలకొన్నాయి. బాలీవుడ్ సీనియర్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని ఈ చిత్రంతో హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకులకు పరిచయం కాబోతుంది. ఇక ఈ సినిమాకు ఆర్ ఎక్స్ 100, మంగళవారం చిత్రాల దర్శకుడు అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తున్నాడు. వైజయంతీ మూవీస్, స్వప్న సినిమా మరియు ఆనంది ఆర్ట్స్ క్రియేషన్స్ వంటి ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

## లోకేశ్ కనగరాజ్ హీరోగా డీసీ



టాకీస్: 'ఖైదీ', 'విక్రమ్', 'కూలీ' వంటి విజయవంతమైన చిత్రాలతో దర్శకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న లోకేశ్ కనగరాజ్ ఇప్పుడు నటుడిగా మారబోతున్నారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'డీసీ'. ఈ సినిమాకు అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహిస్తుండగా.. సన్ పిక్చర్స్ నిర్మిస్తుంది. లోకేశ్ కనగరాజ్ సరసన వామికా గబ్బీ కథానాయికగా నటిస్తుంది. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన గ్లింప్స్‌ను వాలంటైన్స్ కానుకగా విడుదల చేసింది చిత్రయూనిట్. గ్లింప్స్ లో లోకేష్ కనగరాజ్ ఇంటెన్స్ అండ్ రా లుక్ లో కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాడు. లోకేష్ ఇందులో దేవదాస్ పాత్రలో కనిపించబోతున్నాడు.

## ఏప్రిల్ 1న మా పెళ్లి నిజమే

### ర్యూమర్స్‌పై చమత్కరించిన మృణాళ్ ఠాకూర్



టాకీస్: సినీ ఇండస్ట్రీలో రూమర్స్ అనేవి కొత్త విషయం కాదు. ఇద్దరు నటీనటులు కలిసి ఒక ఈవెంట్‌లో కనిపించినా, సోషల్ మీడియాలో వారిద్దరి మధ్య ఏదో సంబంధం ఉందనే వార్తలు చక్కర్లు కొడుతుంటాయి. ఇదే పరిస్థితి ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ మరియు బాలీవుడ్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ విషయంలో కూడా కనిపిస్తోంది. గత కొద్ది రోజులుగా వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారన్న ప్రచారం సోషల్ మీడియా నుంచి మెయిన్ స్ట్రీమ్ మీడియా వరకూ హాట్ టాపిక్‌గా మారింది. ఈ రూమర్స్‌కు అసలు కారణం ఒక పార్టీ. ఓ ప్రైవేట్ ఈవెంట్‌లో ధనుష్, మృణాల్ ఇద్దరూ కలిసి కనిపించడంతో మొదట సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. దానికి తోడు మృణాల్ నటించిన ఓ సినిమా ఈవెంట్‌కు ధనుష్ హాజరుకావడం ఈ అనుమానాలకు మరింత బలం చేకూర్చింది. అప్పటి నుంచి వీరిద్దరూ రిలేషన్‌లో ఉన్నారని, త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారనే వార్తలు వరుసగా వినిపించాయి. మృణాల్ గతంలో 'మేము కేవలం మంచి స్నేహితులమే' అని చెప్పినా కూడా ఈ ప్రచారానికి బ్రేక్ పడలేదు. కొందరు అయితే మరో అడుగు ముందుకేసి వాలెంటైన్స్ డే రోజున అంటే ఫిబ్రవరి 14న వీరిద్దరూ పెళ్లి చేసుకోబోతున్నారని కథనాలు సృష్టించారు. ఇటీవల తన హిందీ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న మృణాల్ ఠాకూర్‌ను ఈ విషయంపై ప్రశ్నించారు. ఫిబ్రవరి 14న ధనుష్‌తో పెళ్లి చేసుకుంటున్నారా?' అని అడగగా మృణాల్ నవ్వుతూ వ్యంగ్యంగా సమాధానం ఇచ్చింది. ఫిబ్రవరి 14 కాదు ఏప్రిల్ 1న చేసుకుంటానేమో. ఎందుకంటే అది ఏప్రిల్ ఫూల్స్ డే కదా!' అంటూ చమత్కరించింది. ఈ వ్యాఖ్య సోషల్ మీడియాలో వెంటనే వైరల్ అయింది. అదే ఇంటర్వ్యూలో మృణాల్ మాట్లాడుతూ, 'ఈ రూమర్స్ ఎక్కడి నుంచి వచ్చాయో కూడా నాకు తెలియదు. కొందరు 'మృణాల్ పెళ్లి అధికారికంగా ఖరారు అయింది' అంటూ ప్రచారం చేస్తున్నారు. ఇది నిజంగా భయంకరంగా ఉంది' అని చెప్పింది. ఇలా క్లియర్ క్లారిటీ ద్వారా ధనుష్‌తో పెళ్లి వార్తలకు మృణాల్ పూర్తిగా చెక్ పెట్టినట్టే అయ్యింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.